# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక : 344 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శనివారం 17 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 344 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SAT 17 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## సత్యసాయి జిల్లాలో విషాద ఘటన..

# నీట మునిగి ఐదుగురు మహిళలు మృతి..

## లోకేశ్ దిగ్భ్రాంతి

- మిగతా 2లో

- శ్రీ సత్యసాయి జిల్లాలో దుర్ఘటన
- గొల్లపల్లి జలాశయంలో మునిగి ఐదుగురు మహిళలు మృతి
- విహారయాత్రకు వెళ్లి సరదాగా ఈతకు దిగడంతో ఘటన
- మృతుల కుటుంబాలకు మంత్రి నారా లోకేశ్ ప్రగాఢ సానుభూతి
- బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ప్రభుత్వ హామీ

శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. పెనుకొండ సమీపంలోని గొల్లపల్లి జలాశయంలో ఈతకు వెళ్లి ఐదుగురు మహిళలు నీట మునిగి మృతి చెందారు. విహారయాత్ర కోసం వెళ్లిన వీరి జీవితాల్లో ఈ సంఘటన అంతులేని విషాదాన్ని నింపింది.




# రాయలసీమలో రణరంగం..

## నామినేషన్ల వేళ టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య రాళ్ల దాడి

- ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ
- పుంగనూరు, రాయచోటిలో ఉద్రిక్త పరిస్థితులు
- అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ
- నామినేషన్ల ప్రక్రియలో ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో దాడులు
- ఎంపీ మిథున్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని దాడి జరిగిందన్న వైసీపీ
- పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని అధికార పార్టీపై విపక్షం ఆరోపణ

అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాలు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకోవడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. అటు రాయచోటిలో వాహనాలకు నిప్పంటించారు.

- మిగతా 2లో

## సాలూరులో పొలిటికల్ ట్విస్ట్..

### పదవి కోసం హడావుడిగా ప్రేమ పెళ్లి.. పొత్తుల రాజకీయంతో టీడీపీ నేత ఆశలు ఆవిరి



- సాలూరు మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం హడావుడిగా పెళ్లి చేసుకున్న టీడీపీ నేత
- సీటు బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో తన ప్రియురాలి మెడలో తాళి కట్టిన హర్షవర్ధన్
- పొత్తుల సర్దుబాటులో భాగంగా ఆ స్థానం జనసేన పార్టీకి కేటాయింపు
- పదవి కోసం పెళ్లి చేసుకున్నా ఫలితం లేకపోవడంతో తీవ్ర నిరాశలో యువ నేత
- స్థానిక రాజకీయాల్లో ఈ పెళ్లి ఉదంతం హాట్ టాపిక్‌గా మారిన వైనం

- మిగతా 2లో

## జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం
- 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'ను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్
- అభ్యర్థి గడల శ్రీనివాసరావు గెలుపునకు పలు సూచనలు
- యువత సమస్యలు తెలుసుకునే వేదికగా ఉండాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రు ల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్

- మిగతా 2లో

## జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గానికి వార్నింగ్...

### కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదు.. వేడెక్కిన తాడిపత్రి



పెన్ పవర్ డెస్క్:అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో రెచ్చగొట్టేలా, బెదిరింపులకు పాల్పడేలా ఆయన వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ తాడిపత్రి పట్టణ అధ్యక్షుడు హాజీ బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- మిగతా 2లో

## ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు దంపతులు
- ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పణ
- ముఖ్యమంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు
- దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబా బు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి శు క్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను వారు సమర్పించారు. ఇంద్రకీలాద్రికి

- మిగతా 2లో



## విమాన టికెట్ ధరల రూల్స్ ఫైనల్ చేయండి

పెన్ పవర్ డెస్క్:విమాన టికెట్ ధరలను నియంత్రించేందుకు ఉద్దేశించిన నూతన నిబంధనల విషయం కొలిక్కి వచ్చిందని, వీటికి పరిపాలనాపరమైన అనుమతులు కూడా లభించాయని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. వచ్చే రెండు వారాల్లో వాటిని నోటిఫై చేస్తామని

- మిగతా 2లో

## అమెరికాలో ఘోరం:

### భార్యను పొడిచి చంపి, భారత్‌కు పారిపోతూ పట్టుబడ్డ భర్త

- అమెరికాలో భార్యను దారుణంగా హత్య చేసిన అంకుర్ పటేల్
- కలిసి జీవించేందుకు నిరాకరించడంతో ఈ ఘాతుకానికి పాల్పడిన భర్త
- కూతురిని చూపిస్తానని నమ్మించి షికాగోకు పిలిపించిన వైనం
- హత్య అనంతరం భారత్‌కు పారిపోయేందుకు ప్రయత్నించి విఫలం



- మిగతా 2లో

## వర్షంలోనూ తరగని భక్తి..

### తిరుమలలో వైభవంగా శ్రీవారి గరుడ సేవ

- నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహన సేవ
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోటెత్తిన లక్షలాది మంది భక్తులు
- లక్ష్మీకాసుల మాలతో గరుత్మంతునిపై దర్శనమిచ్చిన మలయప్ప స్వామి
- గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమల పురవీధులు
- భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేసిన టీటీడీ యంత్రాంగం



- మిగతా 2లో




## ఢిల్లీలో హై టెన్షన్..

### పోలీసుల అదుపులో అభిజిత్ దీప్కే, నేహా బోరా

పెన్ పవర్ డెస్క్: కాక్రోచ్ జనతా పార్టీ లెహ్రా దో తిరంగా నిరసన కార్యక్రమంతో దేశ రాజధాని ఢిల్లీలో హై టెన్షన్ నెలకొంది. శాంతి భద్రతలు, ఇతర కారణాలతో కన్నాట్?ప్లేస్?లో సీజేపీ లెహ్రా దో తిరంగా ర్యాలీకి ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ క్రమంలోనే ర్యాలీలో పాల్గొనకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సీజేపీ ఫౌండర్ అభిజిత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో సీజేపీ మద్దతుదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అభిజిత్?ను తరలిస్తోన్న పోలీస్ వాహవాన్ని సీజేపీ ప్రొటెస్టర్స్

- మిగతా 2లో

## ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర

### బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్



- అభిజీత్ దీప్కే, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- విదేశీ శక్తులతో దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారన్న నితిన్ నబీన్
- ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజా తీర్పుతో వస్తుందని వ్యాఖ్య

- మిగతా 2లో



## పిల్లల సోషల్ మీడియా భద్రత.. కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

- సోషల్ మీడియా ముప్పు నుంచి పిల్లల రక్షణపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు
- పటిష్టమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు
- ప్రస్తుత చట్టాలు సరిపోవని, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని పిటిషన్‌లో వెల్లడి
- ఆన్‌లైన్ వేధింపులు, మానసిక ఆరోగ్యంపై పిటిషనర్ల ఆందోళన
- తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) అధ్యక్షురాలు నేహా బోరాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఎలక్టోరల్ రోల్స్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన ర్యాలీకి కొద్దిసేపటి ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో నిరసన చేపట్టాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అయితే, ఈ ర్యాలీకి మున్సిపల్ కౌన్సిల్ నుంచి అనుమతి లేదని, ఆ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 అమల్లో ఉందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే ర్యాలీకి ముందు అభిజీత్ దీప్కేను, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ అరెస్టులు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ప్రతిపక్షాలు విదేశీ శక్తులతో కలిసి 'ప్రభుత్వాన్ని మార్చే కుట్ర' (రెజీమ్ ఛేంజ్) పన్నుతున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. 'రెజీమ్ ఛేంజ్' వంటి పదాల వాడకంతో ప్రతిపక్షాల అసలు ఎజెండా దేశం ముందు బయటపడిందని.. విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని అస్థిరపరిచేందుకు అర్బన్ నక్సల్స్ పన్నిన పన్నాగం ఇది అని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల తీర్పుతో వస్తుంది కానీ, అరాచకంతో కాదు అని ఆయన హితవు పలికారు. నేతల అరెస్టులు జరిగినప్పటికీ, సుమారు 200 నుంచి 300 మంది నిరసనకారులు కన్నాట్ ప్లేస్‌కు చేరుకుని తమ నిరసనను కొనసాగించారు.

# రాయలసీమలో రణరంగం..

- మొదటి పేజి తరువాయి

వివరాల్లోకి వెళితే.. వైసీపీ లోక్‌సభా పక్ష నేత, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి పార్టీ అభ్యర్థులతో కలిసి నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. టీడీపీ కార్యకర్తలు తమ కాన్వాయ్‌ను అడ్డుకుని, నామినేషన్ కేంద్రానికి వెళ్లకుండా నిరోధించే ప్రయత్నం చేశారని వైసీపీ ఆరోపించింది. కర్రలు, ఇనుప రాడ్లతో వాహనాలపై దాడి చేశారని, ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. ఈ ఘర్షణలో కొందరికి గాయాలయ్యాయి.

ఈ దాడి తనపై జరిగిన హత్యాయత్నమని వైసీపీ తీవ్రంగా ఖండించింది. ఎన్నికల ప్రక్రియను హింసతో అడ్డుకునేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, తమ అభ్యర్థులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించింది. ఈ ఘటనపై రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలని డిమాండ్ చేసింది. బాధ్యులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, అభ్యర్థులకు భద్రత కల్పించి ప్రశాంతంగా నామినేషన్లు వేసేలా చూడాలని కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రాంతంలో నెలకొన్న రాజకీయ వైరం ఈ ఘర్షణతో మరోసారి బయటపడింది.

## వర్షంలోనూ తరగని భక్తి..
### తిరుమలలో వైభవంగా శ్రీవారి గరుడ సేవ

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన గరుడ వాహన సేవ శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఉత్సవాల్లో ఐదో రోజైన ఈ పర్వదినాన, స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతునిపై మలయప్ప స్వామి వారు ప్రత్యేకమైన లక్ష్మీకాసుల హారంతో అలంకృతులై తిరుమాడ వీధుల్లో విహరించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగితేలారు. శుక్రవారం రాత్రి 6:30 గంటలకు వాహన సేవ ప్రారంభమైంది. గజరాజుల గంభీర నడకలు, మంగళవాయిద్యాలు, కళాకారుల భజనలు, కోలాటాలు, జీయంగార్ల వేదఘోషల నడుమ గరుడ వాహనంపై శ్రీవారు ముందుకు కదిలారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ "గోవిందా.. గోవిందా.." అంటూ చేసిన జయజయధ్వానాలతో సప్తగిరులు మార్మోగాయి. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు.

**వర్షంలోనూ అచంచల విశ్వాసం**

మధ్యాహ్నం నుంచి తిరుమలలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి గ్యాలరీల్లో వేచి ఉండి, గరుత్మంతునిపై ఉన్న తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకున్నారు. వర్షంలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, బాదంపాలు, అల్పాహారం వంటివి అందించి వారిని ఆదుకున్నారు. టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. పక్షిరాజైన గరుడుడు భగవంతునికి నిత్య సేవకుడు, పరమ భక్తుడు. ఆయనపై స్వామివారు విహరించడం భక్తికి, శరణాగతికి ప్రతీక. గరుడ వాహనంపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోయి, జ్ఞాన వైరాగ్యాలు సిద్ధిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించడం జన్మ ధన్యమైనట్లుగా భక్తులు భావిస్తారు. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల జీయర్ స్వాములు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు డా. ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీలో హై టెన్షన్.. పోలీసుల అదుపులో

## అభిజిత్ దీప్కే, నేహా బోరా

- మొదటి పేజి తరువాయి

అడ్డుకున్నారు. ఈ పరిణామంతో అక్కడ కాసేపు ఉద్రిక్తతల నెలకొంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సీజేపీ మద్దతుదారులను చెదరగొట్టి అభిజిత్ దీప్కేను అక్కడి నుంచి తరలించారు. సీజేపీ లెహ్రా దో తిరంగా ర్యాలీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కన్నాట్ ప్లేస్ లో భారీగా భద్రతా బలగాలను మోహరించారు. కన్నాట్ ప్లేస్?ను పోలీసులు పూర్తిగా అదుపులోకి తీసుకుని పలు ఆంక్షలు అమలు చేశారు.

**నేహా బోరా అరెస్ట్**

సీజేపీ లెహ్రా దో తిరంగా పిలుపు మేరకు ఢిల్లీలోని మండి హౌస్ ప్రాంతంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. చేతిలో జాతీయ జెండాలు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. నిరసనకు అనుమతి లేకపోవడంతో ఐసా కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా, పంకజ్ భట్టాచార్య తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఈ క్రమంలో పోలీసులు, ఐసా కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. శాంతియుతంగా నిరసన తెలపకుండా అడ్డుకోవమేంటని ఢిల్లీ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కన్నాట్ ప్లేస్, మండి హౌస్ ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

**సీజేపీ లెహ్రా దో తిరంగా మార్చ్ ఎందుకుంటే..?**

ధర్నాలు , ఆందోళనలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఢీనోటిపై చేసిన జంతర్ మంతర్?లో నిరసన వ్యక్తం చేసిన కాక్రోచ్ పార్టీ ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలపై కేసు, అరెస్ట్?ను నిరసిస్తూ అక్టోబర్ 16వ తేదీన ఢిల్లీలోని కన్నాట్ ప్లేసులో లెహ్రా దో తిరంగా యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. శాంతి భద్రతల కారణాలతో సీజేపీ లెహ్రా దో తిరంగా మార్చ్?కు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు.

## జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

- మొదటి పేజి తరువాయి

ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

## ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు దేవాదా య శాఖ ఉన్నతాధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లారు. గర్భాలయంలో చంద్రబాబు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను, ఆయన అర్ధాంగి సారెను అమ్మవారికి సమర్పించారు. దర్శనం ముగిసిన అనంతరం, ఆలయ పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయతీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గానికి వార్నింగ్...
### కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదు.. వేడెక్కిన తాడిపత్రి

- మొదటి పేజి తరువాయి

వివరాల్లోకి వెళ్తే, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పెద్దారెడ్డి తన ప్రత్యర్థి జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గాన్ని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ తరఫున మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ఫయాజ్ బాషాను బరిలోకి దింపుతున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రత్యర్థి, టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన అనుచరులు తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా బెదిరిస్తున్నారని కేతిరెడ్డి ఆరోపించారు. తనను తాడిపత్రి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని, కోర్టు అనుమతితో రావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. "నేను వచ్చినప్పటి నుంచి నా చిటికెన వేలు వెంట్రుక కూడా పీకలేకపోయారు. అధికారం శాశ్వతం కాదు, ఈ విషయం ప్రభాకర్ రెడ్డి అనుచరులు, ఆయనకు మద్దతిచ్చే అధికారులు గుర్తుంచుకోవాలి. నాతో పెట్టుకుంటే ప్రతీకారం తీర్చుకుంటా" అని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలనే ఆధారంగా తీసుకుని, టీడీపీ నేత హాజీ బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దారెడ్డి వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. హాజీ బాషా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పెద్దారెడ్డిపై బీఎన్ఎస్ 192, 351(2), 223 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎన్నికల వేళ ఈ ఘటన తాడిపత్రిలో రాజకీయ ఉద్రిక్తతలను మరింత పెంచింది.

## సాలూరులో పొలిటికల్ ట్విస్ట్.. పదవి కోసం హడావుడిగా ప్రేమ పెళ్లి.. పొత్తుల రాజకీయంతో టీడీపీ నేత ఆశలు ఆవిరి!

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. నామినేషన్ల గడువు సమీపిస్తుండటంతో టికెట్ల కోసం ఆశావహులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో జరిగిన ఓ 'పొలిటికల్ పెళ్లి' ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. మున్సిపల్ ఛైర్మన్ పదవిని దక్కించుకోవాలనే ఆశతో ఓ యువ నేత హడావుడిగా పెళ్లి చేసుకున్నా, పొత్తుల రాజకీయం అతడి ఆశలపై నీళ్లు చల్లింది.

**ఏం జరిగిందంటే?**

సాలూరుకు చెందిన టీడీపీ యువ నేత, మాజీ కౌన్సిలర్ వైకుంఠపు హర్షవర్ధన్‌కు రాజకీయంగా మంచి పట్టుంది. అతడి తండ్రి వైకుంఠపు పంచముఖి కూడా గతంలో కౌన్సిలర్‌గా పనిచేశారు. దీంతో ఈసారి మున్సిపల్ ఛైర్మన్ పదవి తనకే దక్కుతుందని హర్షవర్ధన్ ధీమాతో ఉన్నారు. అయితే, ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లతో సీన్ మొత్తం మారిపోయింది. సాలూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. దీంతో అతడికి ప్రత్యక్షంగా పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. అయినా పట్టు వదలకుండా, పదవిని తమ కుటుంబానికే దక్కించుకోవాలని హర్షవర్ధన్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను ఎనిమిదేళ్లుగా ప్రేమిస్తున్న గుళ్ల మంజీరాను వెంటనే పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. వాస్తవానికి మరో ఆరు నెలల్లో వీరి పెళ్లి జరగాల్సి ఉంది. కానీ, రిజర్వేషన్ సమీకరణాలను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు, ముహూర్తాలు కూడా చూడకుండా, బంధువులను సైతం పిలవకుండా హడావుడిగా మంజీరా మెడలో తాళి కట్టారు. తన భార్య ద్వారా ఎలాగైనా ఛైర్‌పర్సన్ టికెట్ సాధించి, పరోక్షంగా పీఠాన్ని దక్కించుకోవాలని ప్లాన్ చేశారు.

**కూటమి దెబ్బతో నిరాశ**

హర్షవర్ధన్ ప్రణాళిక బాగానే ఉన్నా, రాజకీయ పరిణామాలు ఆయనకు అనుకూలించలేదు. టీడీపీ–జనసేన కూటమి పొత్తుల సర్దుబాటులో భాగంగా, ఆయన ఆశలు పెట్టుకున్న సాలూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించారు. ఎన్నో ఆశలతో, అత్యంత వేగంగా పెళ్లి చేసుకున్న హర్షవర్ధన్‌కు ఈ పరిణామం తీవ్ర నిరాశను మిగిల్చింది.

మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి విధేయుడిగా, బలమైన సామాజిక వర్గం అండ ఉన్నా, పొత్తుల రాజకీయం ముందు అతడి వ్యూహం ఫలించలేదు. పదవి కోసం ప్రేమను, పెళ్లిని ఉపయోగించుకోవాలనుకున్న యువ నేత టికెట్ కథ ఇలా ఊహించని విధంగా ముగియడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

## సత్యసాయి జిల్లాలో విషాద ఘటన.. నీట మునిగి ఐదుగురు మహిళలు మృతి..

- మొదటి పేజి తరువాయి

వివరాల్లోకి వెళితే, పెనుకొండ పట్టణంలోని దర్గాపేటకు చెందిన కొందరు మహిళలు శుక్రవారం విహారయాత్ర కోసం గొల్లపల్లి జలాశయానికి వెళ్లారు. వీరిలో ఐదుగురు సరదాగా ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. అయితే, నీటి లోతు ఎక్కువగా ఉండటంతో ఊహించని విధంగా మునిగిపోయారు. సమీపంలో ఉన్నవారు వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులను మహీం, హసీనా, పుష్పలత, గాయత్రమ్మ, అశ్వినిగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మృతుల కుటుంబాలను ఆదుకుంటాం: మంత్రి లోకేశ్**

ఈ దురదృష్టకర సంఘటనపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "శ్రీ సత్యసాయి జిల్లా గొల్లపల్లి జలాశయం వద్దకు విహారయాత్రకు వెళ్లి ఐదుగురు మహిళలు మృత్యువాత పడటం చాలా బాధాకరం. మృతులకు నివాళులర్పిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది" అని లోకేశ్ పేర్కొన్నారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు మహిళలు ఒకేసారి మృతి చెందడంతో దర్గాపేటలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం శోకసంద్రంలో మునిగిపోయింది.

## అమెరికాలో ఘోరం:
### భార్యను పొడిచి చంపి, భారత్‌కు పారిపోతూ పట్టుబడ్డ భర్త

అమెరికాలో ఒక ప్రవాస భారతీయుడు దారుణానికి ఒడిగట్టాడు. తనతో తిరిగి కలిసి జీవించేందుకు నిరాకరించిందన్న కోపంతో కట్టుకున్న భార్యను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం నేరం నుంచి తప్పించుకునేందుకు భారత్‌కు పారిపోవాలని ప్రయత్నించి, ఎయిర్‌పోర్టులో పోలీసులకు చిక్కాడు. షికాగోలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, భారత సంతతికి చెందిన అంకుర్ పటేల్ (31), అతని భార్య కొంతకాలంగా షికాగోలో నివసిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. గత మే నెల నుంచి వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు. కుటుంబ సభ్యుల ఒత్తిడితో ఆమె ఒకసారి తిరిగి వచ్చినా, మళ్లీ విభేదాలు రావడంతో వేరే నగరానికి వెళ్లిపోయింది. లూసియానాలో తన మాజీ సహోద్యోగితో కొత్త జీవితం ప్రారంభించింది. అయితే, వారి కూతురిని మాత్రం అంకుర్ పటేల్ తన వద్దే ఉంచుకున్నాడు. భార్య వేరొకరితో ఉండటాన్ని సహించలేని అంకుర్, ఆమెకు, ఆమె కొత్త భాగస్వామికి బెదిరింపులు పంపాడు. భార్యకు తెలియకుండా కూతురిని భారత్‌లోని తన తల్లిదండ్రుల వద్దకు పంపించేశాడు. ఆ తర్వాత, కూతురిని చూపిస్తానని నమ్మించి భార్యను షికాగోలోని తన అపార్ట్‌మెంట్‌కు రప్పించాడు. ఆమె తన భాగస్వామితో కలిసి కారులో రాగా, అతను బయటే వేచి ఉన్నాడు. అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లిన ఆమెకు కూతురు కనిపించలేదు. ఈ క్రమంలో, తనతో కలిసి జీవించాలని అంకుర్ కోరగా, ఆమె అందుకు నిరాకరించింది. తన కొత్త భాగస్వామితోనే ఉంటానని స్పష్టం చేయడంతో ఆగ్రహంతో ఊగిపోయిన అంకుర్, కత్తితో ఆమె మెడపై పొడిచి హత్య చేశాడు. ఎంతసేపటికీ ఆమె తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె భాగస్వామి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మరోవైపు, అంకుర్ స్నేహితులు అతని అపార్ట్‌మెంట్‌కు వచ్చి చూడగా, వాషింగ్ మెషీన్ వద్ద ఆమె మృతదేహం కనిపించింది. హత్య అనంతరం అంకుర్ నేరుగా షికాగో ఓ'హేర్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి భారత్‌కు టికెట్ కొనేందుకు ప్రయత్నించాడు. కానీ కౌంటర్ మూసి ఉండటంతో, సమీపంలోని హోటల్‌లో బస చేసి, మరుసటి రోజు టికెట్ కొనుగోలు చేశాడు. అయితే, అప్పటికే అప్రమత్తమైన పోలీసులు అతడిని విమానం ఎక్కేలోపే అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో, ఆమె తనను నిరాకరించడంతోనే "పని పూర్తి చేశానని" అంగీకరించాడు. పోస్టుమార్టం నివేదికలో, ఆమె శరీరంపై అనేక గాయాలు ఉన్నట్లు గుర్తించారు. ప్రాణాలు కాపాడుకునేందుకు ఆమె పోరాడిందని, ఈ క్రమంలోనూ మరికొన్ని గాయాలయ్యాయని తేలింది. పోలీసులు అంకుర్ పటేల్‌పై ఫస్ట్–డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పిల్లల సోషల్ మీడియా భద్రత.. కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. 'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ–ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణిస్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు. తల్లిదండ్రుల ధృవీకరణతో కూడిన అనుమతి, వారి ప్రవర్తనను

ట్రాక్ చేయకుండా ఉండటం, లక్షిత ప్రకటనలపై పరిమితులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతమున్న చట్టాలు అసంపూర్తిగా ఉన్నాయని, పిల్లల భద్రతకు సంబంధించి వయసు నిర్ధారణ, తల్లిదండ్రుల ప్రమేయం, సోషల్ మీడియా సంస్థల జవాబుదారీతనంపై స్పష్టమైన విధానం లేదని పిటిషన్‌లో ఆరోపించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, వేధింపులు, హానికర కంటెంట్, అపరిచితుల నుంచి ప్రమాదకర పరిచయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వినియోగం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, ఆత్మన్యూనత, చదువుపై శ్రద్ధ తగ్గడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల ఖాతాలకు తప్పనిసరి ప్రైవసీ సెట్టింగ్‌లు, వయసుకు తగిన యాక్సెస్, హానికర కంటెంట్‌పై ఆంక్షలు విధించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

## విమాన టికెట్ ధరల రూల్స్ ఫైనల్ చేయండి

- మొదటి పేజి తరువాయి

పేర్కొంది. ఇందుకు సంబంధించిన పిటిషన్‌ను మరోసారి విచారించిన సర్వోన్నత న్యాయస్థానం.. నవంబర్ 16న తదుపరి విచారణ చేపడతామని తెలిపింది. అప్పటిలోగా కొత్త నిబంధనలను తమ ముందు ఉంచాలని కేంద్రాన్ని ఆదేశించింది. డిమాండ్ ఉన్న సమయాల్లో విమానయాన సంస్థలు టికెట్ ధరలను ఊహించని విధంగా పెంచుతుండడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇలా ఇష్టానుసారంగా పెంచడంతో విమాన ప్రయాణం ఖరీదుగా మారుతోందని, వీటిని నియంత్రించాలని కోరుతూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ధ:రల నిర్ణయంపై మరింత నిశిత పరిశీలన జరగాలని, పరిష్కార చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌పై కొంతకాలంగా విచారణ జరుపుతోన్న సర్వోన్నత న్యాయస్థానం.. నిబంధనలు పాటించని ఎయిర్‌లైన్స్‌పై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వానికి సూచించింది. అయితే, 'భారతీయ వాయుయాన్ అధినియం–2024' చట్టం కింద కొత్త నిబంధనలు రూపొందించిన కేంద్రం.. ఈ ముసాయిదాను సుప్రీం కోర్టుకు ఇటీవలే అందించింది.

# దసరా ఉత్సవాల సందర్భంగా ఘనంగా బోనాల ఊరేగింపు

**వై రామవరం, పెన్ పవర్,అక్టోబర్ 16 :** దసరా ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం మండలంలో పి. ఎర్రగొండ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో బోనాల తో మహిళలు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పి.ఎర్రగొండ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద గ్రామంలోని మహిళలు ముందుగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోరున వర్షంలో కూడా భక్తిశ్రద్ధలతో ప్రతి మహిళ బోనాలను ఎత్తుకొని గ్రామం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం వర్షంలోనే గ్రామ పొలిమేర దగ్గర ఉన్న గ్రామ దేవత గంగాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం వట్టిగడ్డ గ్రామంలో ఉన్న ఎర్రల్లమ్మ తల్లిని దర్శించుకొని ఊరేగింపుగా బయలుదేరి పనసలపాలెం గ్రామంలో ఉన్న అమ్మవారి గుడి దగ్గర బోనాలతో మహిళలు నృత్యం చేశారు. అనంతరం చవిటి దిబ్బల సెంటర్లో కనకదుర్గ అమ్మవారి ఆలయం ఎదురుగా మహిళలు భక్తి పాటలతో



నృత్యం చేశారు. దారి పొడవునా ఉన్న అమ్మవారి దేవాలయాలలో మహిళలు బోనాలతో అమ్మవార్లను దర్శించుకున్నారు. సుమారు 12 కిలోమీటర్ల మేర మనలను ఊరేగించి న అనంతరం దేవరమడుగుల గ్రామం వద్దన్న పెద్దేరులో బోనాలను నిమజ్జనం చేశారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# మహిళల భద్రత.. రోడ్డు ప్రమాదాల నివారణ.. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం!

- మూడు ప్రధాన లక్ష్యాలతో 'ఆపరేషన్ త్రిశూల్'కు కార్యాచరణ
- గంజాయి రహిత జిల్లాగా పోలవరాన్ని తీర్చిదిద్దాలి
- గంజాయి అక్రమ వ్యాపారుల ఆస్తుల జప్తునకు చర్యలు
- ప్రమాదకర రహదారులను గుర్తించి పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలి
- ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో బాలికల రక్షణపై ప్రత్యేక నిఘా
- శాఖల మధ్య సమన్వయంతోనే మెరుగైన ఫలితాలు: కలెక్టర్ కె. దినేష్ కుమార్
- ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ముందుగానే నివారించాలి: ఎస్పీ కె. చక్రవర్తి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 16:**మహిళలు, బాలికల భద్రత, రహదారి ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ త్రిశూల్'ను జిల్లావ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణరక్షణ, మహిళల భద్రత, యువత భవిష్యత్తును కాపాడటంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆపరేషన్ త్రిశూల్‌పై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ జావలి, సబ్ కలెక్టర్లు డి. పృథ్వీరాజ్ కుమార్, నరేంద్ర పడల్, డీఎస్పీలు అశ్రఫ్ అలీ, పావని పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణ, రహదారి భద్రత, గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.

**మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యం**

మహిళలు, బాలికలపై వేధింపులు, అఘాయిత్యాలను అరికట్టేందుకు పోలీసు, మహిళా శిశు సంక్షేమ, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి నెలా ఐసీడీఎస్, పోలీసు, విద్యాశాఖ అధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థినులకు భద్రత, చట్టపరమైన రక్షణ, అత్యవసర సహాయ సేవలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహిళలు, బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో 112 సహాయవాణి అందుబాటులో ఉంటుందన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బాల్య వివాహాల నిరోధానికి కఠిన చర్యలు చేపట్టాలని, 18 ఏళ్లు నిండని బాలికలకు వివాహాలు జరిపించినట్లు గుర్తిస్తే చట్టప్రకారం వెంటనే కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.

**గంజాయి రహిత జిల్లాగా పోలవరాన్ని తీర్చిదిద్దాలి**

పోలవరం జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. గంజాయి అక్రమ వ్యాపారంలో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు చట్టపరమైన నిబంధనల మేరకు వారి ఆస్తుల జప్తునకు చర్యలు చేపట్టాలన్నారు. అక్రమ వ్యాపారాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అదే సమయంలో గంజాయి వ్యాపారాన్ని విడిచిపెట్టిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలు కల్పించేలా సంబంధిత శాఖలు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. యువత మాదకద్రవ్యాల బారినపడకుండా కళాశాలలు, పాఠశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**జాతీయ రహదారులపై ప్రమాదాల పెరుగుదలపై ఆందోళన**

పోలవరం జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడినప్పటికీ రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండటం ఆందోళనకరమని కలెక్టర్ పేర్కొన్నారు. గత ఆరు నెలల్లో జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాలను విశ్లేషించి, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణ చర్యలు, హెచ్చరిక బోర్డులు, ఇతర రక్షణ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రహదారులు ఎంత మెరుగ్గా ఉన్నప్పటికీ అతివేగం ప్రాణాలకు ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

**మారేడుమిల్లి--చింతూరు ఘాట్ రోడ్డుపై ప్రత్యేక నిఘా**

మారేడుమిల్లి--చింతూరు మధ్య ఘాట్ రహదారిపై భద్రతా ప్రమాణాలను పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మార్గంలో అధిక లోడుతో ప్రయాణించే భారీ వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. వాహనాల బరువును తనిఖీ చేసేందుకు అవసరమైన ప్రాంతాల్లో తూకపు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు 1033 ఉచిత సహాయవాణిని సంప్రదించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని, రహదారి భద్రతా తనిఖీ బృందాలు సమర్థంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

**మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు**

గిరిజన ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే



ప్రమాదాలపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపేవారిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు నాణ్యతా ప్రమాణాలు కలిగిన హెల్మెట్లు ధరించేలా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఐఎస్ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్ల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన హిట్ అండ్ రన్ కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్య, గిరిజన సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలే కీలకం: ఎస్పీ**

జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా, అసలు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ఆచరణాత్మక పరిష్కారాలను గుర్తించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రహదారి భద్రతపై అవగాహన లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి విశ్లేషించాలని సూచించారు. కళాశాల విద్యార్థులు, యువతలో రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

**ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు**

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సీసాలను పగులగొట్టి ఇతరులకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.

**గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి**

పోలవరం జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణా జరుగుతుందనే అపఖ్యాతిని తొలగించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల రవాణా మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసు శాఖతోపాటు ఇతర శాఖలు సహకరించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగానికి అలవాటుపడిన వారిని గుర్తించి, వారికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టడంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు.

**'ఆపరేషన్ త్రిశూల్' గోడపత్రిక ఆవిష్కరణ**

నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాలో రహదారి భద్రత, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన అనే మూడు ప్రధాన అంశాలతో ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీతోపాటు ఇతర ఉన్నతాధికారులు ఆపరేషన్ త్రిశూల్ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమ లక్ష్యాలు, అమలు విధానాలు, శాఖల బాధ్యతలపై దృశ్య ప్రదర్శన ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు రుక్మండయ్య, డీసీహెచ్ఎస్ సాంబశివరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, పీహెచ్ఓ నరేంద్ర కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి జి. శ్రీరామ్ మూర్తి, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఐ. శ్రీనివాసరావు, రవికుమార్, సీపీఓ వెంకట్రావు, ఆర్టీవో రాజేష్ కుమార్, ఏఈడీ సావిత్రి, సీడీపీఓ క్రాంతికుమారి, డీఎల్పీఓ ఎర్రంశెట్టి రాజు, డాక్టర్ నీలిమ, డీఈలు భవాని, పి. వెంకటరమణ, రమేష్, రామచంద్రమూర్తి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పదవులు సరే... సమస్యల మాటేమిటి...?????

**గుమ్మళ్ళదొడ్డిలో పడకేసిన పాలనబి కుక్కలుబికోతుల దాడులతో బెంబేలు.**

**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 16:**-గ్రామాల్లో ఎన్నికల పండుగ వచ్చేసింది. ఆయా పార్టీల నాయకులు పదవుల వేటలో మునిగి తేలుతున్నారు. ఇదే సమయంలో గ్రామాల్లో మౌలిక సమస్యలను



అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు గాలికి వదిలేసారు. అధికారులకు చెబుతుంటే ఎన్నికల విధులు అని,నాయకులకు చెబుతుంటే అధికారంలోకి వచ్చాక చేస్తామంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. గత మూడు నెలలుగా ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలలో అధ్వాన్న పరిస్థితి నెలకొన్నాయి. మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో ఒక పక్క కార్పొరేట్ కంపెనీలతో అవస్థలు పడుతుంటే,మరోపక్క కోతులు, కుక్కలు,పందులు గ్రామస్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. పట్టపగలు బయటకు రావడానికి భయపడే స్థితికి ప్రజలు చేరుకున్నారు. గురువారం సాయంత్రం గ్రామంలోని వినాయకుని ఆలయ సమీపంలో కోతులు దాడుల్లో నలుగురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. పందులు, కుక్కలు నిరంతరం జనావాసాల్లో ఉంటూ విద్యార్థులను, చిన్నారులను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయి. గ్రామంలో మంచినీటి సమస్యతో శెట్టి బలిజిపేట,దళితపేటల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పక్కన ఉన్న రామాలయం వద్ద మంచినీటి పైప్ లైన్ పాడవ్వడంతో నిత్యం నీరు వృధాగా పోతున్నప్పటికీ తాము ఎవరికీ సంబంధం లేదన్నట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా అస్త వ్యస్థమైన డ్రైనేజీలే దర్శనమిస్తున్నాయి. గౌరీ సెంటర్ నుండి శ్రీరామగిరి కొండ వైపుకు వెళ్లే దారిలో వెళ్లాలంటే ప్రధాన రహదారిపై వెళ్తున్న డ్రైనేజీ నీటిని తాకే వెళ్ళాల్సిన పరిస్థితిలు ఉన్నాయి. గ్రామంలో తిష్ట వేసిన సమస్యలు తొలగాలంటే అధికారులు వెంటనే చొరవ తీసోకుంటారో, ఎన్నికలయ్యాక గెలిచిన వారే చూసుకుంటారని వదిలేస్తారో ఎదురు చూడాలి. ఇది ఎలా ఉండగా గ్రామంలో ఇలాంటి ప్రదాన సమస్యలు అనేకం ఉంటే దీని మీద దృష్టి పెట్టని నాయకులు ఇప్పుడు పదవులు కావాలంటే పాకులాడడం చేస్తుంటే స్థానికులు దీనికోసం వీళ్లకు పదవులంటూ పలు గుసగుసలాడుకుంటున్నారు.

# సరస్వతీ దేవి అలంకారంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు

- గంగవరంలో వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

**గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 16:**దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గంగవరం మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని చదువుల తల్లి సరస్వతీ దేవి అవతారంలో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, సరస్వతీ దేవి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తుల రాకతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలతో పాటు ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.



# చిన్నగార్లపాడులో వైభవంగా శ్రీ కనకదుర్గమ్మ పడిపూజ

- మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు
- గురుభవాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా ఆధ్యాత్మిక కార్యక్రమం
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భవానీ దీక్షాధారులు, గ్రామస్థులు

**గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 16:**దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గంగవరం మండలంలోని చిన్నగార్లపాడు గ్రామంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి పడిపూజ కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. మూలా నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని గురుభవాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భవానీ దీక్షాధారులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.దఈ సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, కుంకుమలతో అర్చనలు చేశారు. భవానీ దీక్ష స్వీకరించిన భక్తులు నియమనిష్ఠలతో అమ్మవారిని ఆరాధిస్తూ పడిపూజలో పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణ, భక్తుల



జయజయధ్వానాలతో పూజా ప్రాంగణం మార్మోగింది. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిపారవశ్యంలో చిన్నగార్లపాడు

మూలా నక్షత్రం సందర్భంగా నిర్వహించిన పడిపూజ కార్యక్రమంతో చిన్నగార్లపాడు గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భవానీ దీక్షాధారులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించారు. గ్రామంలోని మహిళలు, పెద్దలు, యువకులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. భవానీల ప్రత్యేక పూజలు, అమ్మవారి నామస్మరణతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా పడిపూజ

దేవీ నవరాత్రుల్లో మూలా నక్షత్రానికి విశేష ప్రాధాన్యం ఉందని, ఈ పవిత్రమైన రోజున అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం శుభప్రదమని భక్తులు విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో గురుభవాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామస్థులంతా ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. భవానీ దీక్షాధారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# స్థానిక ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు!

- అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై ప్రత్యేక నిఘా
- ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు పంపిణీ చేస్తే చట్టపరమైన చర్యలు
- సర్పంచ్, వార్డు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులకు వ్యయ పరిమితులు
- ప్రచార ఖర్చులను రోజువారీగా నమోదు చేయాల్సిందే
- ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు
- స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలకు సహకరించాలి
- కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 16 :**స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా చట్టపరమైన చర్యలు తప్పవని పోలవరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ హెచ్చరించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి వెచ్చించే ప్రతి రూపాయికి లెక్కలు చూపాలని, నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి ఫలితాల ప్రకటన వరకు ఖర్చుల వివరాలను రోజువారీగా నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

**అభ్యర్థుల ఖర్చులకు పరిమితులు ఇవే!**

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచార వ్యయానికి పరిమితులు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థి గరిష్ఠంగా రూ.4 లక్షలు, వార్డు సభ్యుడి అభ్యర్థి రూ.లక్ష వరకు ఖర్చు చేయవచ్చన్నారు. 10 వేలలోపు జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థికి రూ.2.50 లక్షలు, వార్డు సభ్యుడికి రూ.60 వేల వరకు వ్యయ పరిమితి ఉన్నట్లు వివరించారు. ఎంపీటీసీ అభ్యర్థికి రూ.4 లక్షలు, జెడ్పీటీసీ అభ్యర్థికి రూ.8 లక్షల వరకు పరిమితులు పేర్కొన్నారు. అయితే అభ్యర్థులు తమ స్థానాలకు వర్తించే తుది వ్యయ పరిమితులను రాష్ట్ర ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులు, సంబంధిత ఎన్నికల అధికారుల ద్వారా నిర్ధారించుకోవాలని సూచించారు.

**ప్రతి రూపాయికీ లెక్క చూపాల్సిందే!**

ఎన్నికల ప్రచారంలో ఖర్చు చేసే ప్రతి రూపాయిని అభ్యర్థులు నిర్దేశిత రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ప్రచార వాహనాలు, కరపత్రాలు, బ్యానర్లు, సభలు, సమావేశాలు, ఇతర ప్రచార సామగ్రికి సంబంధించిన ఖర్చులను రోజువారీగా నమోదు చేయాలన్నారు. ఆయా ఖర్చులకు సంబంధించిన బిల్లులు, రశీదులను భద్రపరచాలని సూచించారు. ఎన్నికల వ్యయ ఖాతాలను సంబంధిత ఎన్నికల అధికారులకు నిర్ణీత గడువులోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. పంచాయతీరాజ్ ఎన్నికలకు వర్తించే నిబంధనల ప్రకారం ఫలితాల ప్రకటన నుంచి 45 రోజుల్లోగా వ్యయ ఖాతాలను సమర్పించాలని తెలిపారు.

**ఓటర్లను ప్రలోభపెడితే చర్యలు తప్పవు**

ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు నగదు, మద్యం, బహుమతులు, నిత్యావసర వస్తువులు లేదా ఇతర ప్రయోజనాలను పంపిణీ చేయడం చట్టవిరుద్ధమని కలెక్టర్ హెచ్చరించారు. ఓటుకు ప్రతిఫలంగా డబ్బు, వస్తువులు ఇవ్వడం, స్వీకరించడం నిషేధమన్నారు. ఎన్నికల అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాలు, సంచార తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ఘటనలు ఎక్కడైనా గుర్తిస్తే వెంటనే సంబంధిత ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

**ప్రభుత్వ వనరులను ప్రచారానికి వాడొద్దు**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ వాహనాలు, కార్యాలయాలు, అతిథి గృహాలు, ప్రభుత్వ సిబ్బంది, ప్రజాధనంతో నిర్వహించే వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. కొత్త పథకాల ప్రకటనలు, ఓటర్లను ప్రభావితం చేసే ప్రయోజనాల పంపిణీ, శంకుస్థాపనలు, అభివృద్ధి పనుల ప్రకటనల విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**సభలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి**

ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ధ్వనివర్ధకాల వినియోగానికి సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ధ్వనివర్ధకాల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధ నిబంధనలను పాటించాలన్నారు. ప్రైవేటు ఇళ్లు, ప్రహరీలు, భవనాలపై యజమానుల అనుమతి లేకుండా ప్రచార ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయరాదన్నారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తులపై ప్రచార సామగ్రి ఏర్పాటు విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలను ఉల్లంఘించరాదని హెచ్చరించారు.

**కులమతాల పేరుతో ఓట్లు అడగరాదు**

ఎన్నికల ప్రచారంలో కులం, మతం, భాష ఆధారంగా ఓట్లు అభ్యర్థించడం, వర్గాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగించడం నిషేధమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచార వేదికలుగా ఉపయోగించరాదన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దూషణలకు పాల్పడకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.

**ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలి**

స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందని కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిస్థాయిలో పాటించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యమే లక్ష్యం!

- గిరిజన ఆవాసాలకు రోడ్డు కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి
- 'అడవి తల్లి బాట' ద్వారా 34 రహదారుల ఏర్పాటుకు చర్యలు
- జిల్లాలో అత్యంత కొండ ప్రాంతాల్లో ఉన్న 51 గ్రామాల గుర్తింపు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 129 గ్రామాలకు రహదారులు
- పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి
- మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- అధికారులకు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ దిశానిర్దేశం



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 16:**పోలవరం జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన ఆవాసాలకు రహదారి అనుసంధానం కల్పించడం ద్వారా విద్య, వైద్యం, రవాణా తదితర ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా కొండలు, అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలకు కనీస మౌలిక సదుపాయాలు అందించేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్‌తో కలిసి వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, ఏపీఈపీడీసీఎల్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, గృహ నిర్మాణ శాఖల ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలతో శాఖలవారీగా అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.

**129 గ్రామాలకు రహదారులు.. ప్రణాళికాబద్ధంగా చర్యలు!**

ఈ సందర్భంగా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి సౌకర్యం లేని గిరిజన ఆవాసాలను గుర్తించి, వాటికి రోడ్డు కనెక్టివిటీ కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలోని 129 గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే 'అడవి తల్లి బాట' కార్యక్రమం ద్వారా 34 రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలో అత్యంత క్లిష్టమైన కొండ ప్రాంతాల్లో ఉన్న 51 గ్రామాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు, అనుమతులు, ఇతర సాంకేతిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

**అటవీ భూముల సమస్యలపై ప్రత్యేక ఆరా!**

మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణంలో ఎదురవుతున్న అటవీ భూముల సమస్యలపై కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రహదారుల ఏర్పాటుకు ఎంత అటవీ భూమి అవసరమవుతుంది? సంబంధిత అనుమతుల పరిస్థితి ఏమిటి? అనే అంశాలపై ఆరా తీశారు. రహదారి నిర్మాణాలకు సంబంధించిన అడ్డంకులను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పీవీటీజీ, నాన్ పీవీటీజీ గిరిజన ఆవాసాల జాబితాలను ఏ సర్వే ఆధారంగా రూపొందిస్తున్నారనే విషయంపై అధికారుల నుంచి వివరణ కోరారు.

**మంజూరైన పనులు ఎన్ని?.. పూర్తయినవి ఎన్ని?**

పంచాయతీరాజ్, పీఏయూ ఇంజనీరింగ్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్, రోడ్లు భవనాల శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖలకు మంజూరైన రహదారులు, మౌలిక వసతుల పనులు ఎన్ని? ఇప్పటివరకు పూర్తయినవి ఎన్ని? ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు ఎన్ని? అనే వివరాలను శాఖలవారీగా అడిగి తెలుసుకున్నారు.

గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు అమలయ్యాయనే అంశాన్ని కూడా పరిశీలించారు. అభివృద్ధి పనుల అమలులో జాప్యానికి గల కారణాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

**గిరిజన ప్రాంతాల అభివృద్ధికి శాఖల సమన్వయం అవసరం!**

రహదారులు కేవలం రవాణా అవసరాలకే పరిమితం కాకుండా గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కీలకంగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. మారుమూల గ్రామాలకు రహదారులు అందుబాటులోకి వస్తే అత్యవసర వైద్య సేవలు, విద్యా సౌకర్యాలు, నిత్యావసర వస్తువుల రవాణా మరింత సులభమవుతాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గిరిజన కుటుంబానికి చేరాలంటే మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి!**

గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. తాగునీటి పథకాల కింద మంజూరైన పనులు, పూర్తయిన పనులు, పెండింగ్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సురక్షిత తాగునీరు అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

**పెండింగ్ పనులపై నిరంతర పర్యవేక్షణ!**

జిల్లాలోని మారుమూల ప్రాంతాల అభివృద్ధి విషయంలో అధికారులు ప్రత్యేక బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. రహదారి సౌకర్యం లేని మిగిలిన ఆవాసాలను కూడా గుర్తించి, వాటికి కనెక్టివిటీ కల్పించే దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, ఈఈ ఐ. శ్రీనివాసరావు, డీఈలు భవాని, నాగరాజు, సుబ్బారావు, పి. వెంకటరమణ, రమేష్, సాలెం రాజ్, ఏఈ సత్యనారాయణతో పాటు వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమాలు తప్పనిసరిగా పాటించాలి - కార్యదర్శి షకీలా.

**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 16:-**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని రంప యర్రంపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి షకీలా హెచ్చరించారు.ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి గ్రామంలో ప్రతి వీధిలో పర్యటిస్తూ, ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సోదరభావంతో మెలగాలని ఆమె సూచించారు.

ఈ సందర్భంగా కార్యదర్శి షకీలా మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు అంటే మన కుటుంబాల నేపథ్యం ఉన్న ఎన్నికలు. కాబట్టి అందరూ మంచి ఆలోచనతో, సామరస్యంతో ఉండాలి. ముఖ్యంగా యువత ఆవేశాలకు లోను కాకుండా, బంధాలను, బంధుత్వాలను గుర్తుపెట్టుకుని, తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని కోరారు.ఎన్నికల నియమావళిలో భాగంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు గుడ్డలతో ముసుగులు వేయించారు, అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగించడం వంటి చర్యలు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి షకీలాతో పాటు గ్రామ మహిళా పోలీస్ అన్నపూర్ణ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో శ్రీ కనకదుర్గమ్మ దర్శనం

వైభవంగా 25వ దసరా మహోత్సవాలు



**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 16:**తాళ్ళపూడిలోని ప్రసిద్ధ శ్రీ నవదుర్గాది పరివార శ్రీ చక్ర సహిత శ్రీ కనకదుర్గ అమ్మవార్ల దేవాలయంలో 25వ దసరా మహోత్సవాలు అత్యంత ఘనంగా, వైభవంగా జరుగుతున్నాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ కనకదుర్గ అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు .మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో శోభాయమానంగా దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు పులకించిపోయారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నీలి సూర్యనారాయణ, నీలి శ్రీనివాస్ మాట్లాడుతూ... రజతోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న 25వ దసరా మహోత్సవాలకు సంబంధించి ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులందరూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జగన్మాత కృపాకటాక్షాలు, అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు.

## మద్యానికి బానిసలై ద్విచక్ర వాహనాలు చోరీ



**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 16:**మద్యానికి బానిసలైన యువకులు డబ్బులు కోసం వాహనాల చోరీకి దిగారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నార్త్ జోన్ డిఎస్పి జీవన కోరుకొండ సీఐ మూర్తి, సీతానగరం ఎస్సై శ్రీను నాయక్ శుక్రవారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతానగరం మండలంలోనీ మి ర్తి పాడు గ్రామానికి చెందిన ముళ్ళ ప్రవీణ్ కుమార్, చిటికిన సత్య కుమార్, మాణిక్యం మహేంద్ర అనే ముగ్గురు యువకులు జల్సాలుగా అలవాటు పడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 14 ద్విచక్ర వాహనాలను దొంగతనం చేశారు. వీరి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులను రాజమహేంద్రవరం కోర్టుకు హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు.

## ఎన్నికల నిర్వహణపై అధికారుల సమన్వయ సమావేశం

-ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: ఎంపీడీవో ఇమ్మానియేల్




**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.16:** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఇమ్మానియేల్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో శుక్రవారం రేఖపల్లి మండల పరిషత్ కార్యాలయం సమావేశపుహాలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి,ఇమ్మానియేల్,అధ్యక్షతనలో అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న రాజకీయ ఫ్లెక్సీలు,బ్యానర్లు,గోడ రాతలను వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత బృందాలకు స్పష్టం చేశారు.

ఎన్నికల విధుల్లో నియమితులైన మండల స్థాయి అధికారులు,ప్రాంతీయ పర్యవేక్షణ అధికారులు,తనిఖీ బృందాలకు వారి విధులు,బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు.నగదు,మద్యం, బహుమతుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే,తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తాగునీరు,విద్యుత్,మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేసి, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో మండల తహసీల్దార్ వై.సరస్వతి, మండల ఎన్నికల అధికారులు,వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు,ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది.స్థానిక ఎస్. ఐ.సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చండీ హోమం తరలివచ్చిన భక్తులు

* పాల్గొన్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 16:** దేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ ఆధ్వర్యంలో శుక్ర వారం అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం సందర్భంగా సప్తశతి చండీ హోమం నిర్వహించారు. బ్రహ్మశ్రీ కాళీపట్నం మణికంఠ నాగేంద్ర కుమార్ శర్మ ఆధ్వర్యంలో శ్రీరామనగర్ లోని గన్ని కృష్ణ నివాసం వద్ద వేదమంత్రాల నడుమ సప్తశతి చండీ హోమం జరిగింది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులతో పాటు, భక్తులు తరలివచ్చారు. సప్తశతి చండీ హోమం తర్వాత పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. ఈ హోమానికి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించి ఆశీస్సులు అందుకున్నారు.

పూజా కార్యక్రమాల అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేసి ఆశీస్సులు అందుకున్నారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, రాజమండ్రి మునిసిపల్ ఎన్నికల పరిశీలకులు దేవినేని ఉమా, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ, కుల, మత, రాజకీయాలకు అతీతంగా చండీహోమం నిర్వహిస్తున్నారన న్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తుందన్నారు. గన్ని కృష్ణ మాట్లాడుతూ ప్రజలు, రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి మూలా నక్షత్రం రోజున చండీ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశ్రావు,పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్,ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, ఆకుల వీర్రాజు టి కే విశ్వేశ్వర రెడ్డి, చల్లా శంకర్రావు, మార్ని వాసుదేవరావు, చెరుకూరి రామారావు, దేవరపల్లి కృష్ణ,గంగిన నారాయణరావు,బొప్పన నాగేశ్వరరావు,పెండ్యాల రామకృష్ణ,నిమ్మలపూడి గోవింద్, ,కంటిపూడి పద్మావతి, ,ఇన్నమూరి రాంబాబు,వాకచర్ల కృష్ణ,బట్లంకి ప్రకాష్,వీరబాబు,తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత సామాజిక బాధ్యతగా మారాలి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 16:**పరిశుభ్రమైన రాజమహేంద్ర వరం నిర్మాణానికి నగరపాలక చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కీలకమని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. 'రాజమహేంద్రవరం స్వచ్ఛోత్సవ్ -2026'లో భాగంగా నగరంలోని శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం లో శుక్రవారం జరిగిన స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛత, పారిశుధ్య నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులు, విద్యార్థులు, హాస్పిటల్స్, హోటల్స్, రైతు బజార్లు సహా 22 కేటగిరీలలో 230 మందికి అవార్డులను ప్రదానం చేసి అభినందించారు. అనంతరం కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, స్వచ్ఛత, పరిశుభ్రత, పారిశుధ్యంలో విశిష్ట సేవలు అందించిన వారిని అవార్డులతో సత్కరించడం అభినందనీయమన్నారు. నగర జనాభా 4 లక్షలు కాగా రోజుకి దాదాపు 160 టన్నుల చెత్త ఉత్పన్నమవు తోందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించడం ద్వారా సమాజంలో శాశ్వతమైన, సానుకూల మార్పును తీసుకురావచ్చన్నారు. రేపటి పౌరులుగా తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు తారనారరు. ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్ -- రీయూజ్- రీసైకిల్) సెంటర్ల నిర్వహణ వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులు వివరించడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన పరిసరాలు ఆలోచనలు, అలవాట్లు, చర్యలు కూడా పరిశుభ్రంగా ఉండాలని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. . చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయడం, తడి-పొడి చెత్తను వేర్వేరుగా అందించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అలవాట్లను పాటించాలని సూచించారు. ప్రజల సహకారం లేకుండా సంపూర్ణ స్వచ్ఛత సాధ్యం కాదన్నారు. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో రాజమహేంద్రవరం ప్రతిభ కనబరుస్తోందనన్నారు. ఇదే స్ఫూర్తితో అధికారులు, ప్రజలు సమన్వయంతో "స్వచ్ఛ రాజమహేంద్రవరం - ఆరోగ్యకర రాజమహేంద్రవరం" నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, సెక్రటరీ జి.శైలజవల్లి, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, ఈఈలు మదర్శా అలీ, మాధవి, అవార్డు గ్రహీతలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎం సి సి పై స్వర్ణ గ్రామ సిబ్బందికి సూచనలు



**వై రామవరం,పెన్ పవర్, అక్టోబర్ 16 :** మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పై స్వర్ణ గ్రామ సిబ్బందికి సూచనలు సలహాలు ఎంపీపీ ఆఫీసు నందు శుక్రవారం ఇవ్వడం జరిగిందని ఎంపీడీవో కే. బాపన్న దొర తెలిపారు.

ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2026 ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం వివిధ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు తొలగించాలని, శిలాఫలకాలపై ముసుగులు వేయాలని సూచించారు. అదేవిధంగా రాజకీయ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులకు సహకారం అందించాలని అన్నారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండడం కొరకు మండల తహసిల్దార్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.

# ఖనీమా మసీదు అభివృద్ధి కి బిసిటీ రూ.15 లక్షలు వితరణ

### - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ , పవర్, అక్టోబర్ 16:**నగరంలోని 2వ డివిజన్ నారాయణపురంలో ఉన్న ఖనీమా మసీదు పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. భవాని చారిటబుల్ ట్రస్ట్ (బిసిటీ) రూ.15 లక్షలతో చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. మసీదు అవసరాలు, ముస్లింల విశ్వాసాలు, మనోభావాలకు అనుగుణంగా నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో నారాయణపురంలో శిథిలావస్థలో ఉన్న మసీదు పునర్నిర్మాణం చేపడతానని హామీ మేరకు బాధ్యతగా భావించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి తన కుటుంబం, తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉన్నాయని స్పష్టం చేశారు. మైనారిటీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించడంలో భాగంగా సయ్యద్ అఫ్సరీకి రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాషా లిమ్రాకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ నూర్ బాషా ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించామ న్నారు. నియోజకవర్గంలో మైనారిటీ మత సంస్థల నిర్వహణకు ఈద్గా కమిటీ, బిలాల్ మసీదు, షాదీఖానా కమిటీ, మున్సిపల్ ముస్లిం బరియల్ గ్రౌండ్ కమిటీ, గొలుసుల పంజా కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాడితోట నూర్ మసీదు వద్ద రూ.5 లక్షలతో బయట షెడ్డు నిర్మాణానికి, అయేషా మసీదు వద్ద రూ.10 లక్షలతో లోపల షెడ్డు నిర్మాణానికి భవాని చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందించినట్లు గుర్తుచేశారు. నాలుగో వార్డులోని బిలాల్ మసీదు పునర్నిర్మాణానికి రూ.లక్ష అందించడంతో పాటు, సుమారు 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పొజిషన్ సర్టిఫికెట్ సమస్యను పరిష్కరించినట్లు వెల్లడించారు. ముస్లిం నాయకులు మహమ్మద్ అబ్దుల్లా, భాష లిమ్రా, సయ్యద్ అప్సరీ, మహబూబ్ జానీ, అస్లాం, బషీరుద్దీన్ బాబు, బాబాఖాన్ (ఖాన్ భాయ్), జిలాని, అమిర్ రాజా, అహ్మదున్నిసా, ఉప్పులూరి జానకి రామయ్య, సలాది ఆనంద్, దొంగ నాగమణి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ నిట్ గ్రంథాలయంలో భక్తిశ్రద్ధలతో సరస్వతీ దేవి పూజ



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. అక్టోబర్ 16 :**నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో శుక్రవారం సరస్వతీ దేవి పూజా కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గ్రంథాలయ చైర్మన్, ఆచార్యులు డాక్టర్ కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలకు డీన్లు డాక్టర్ జి. రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ జీబీ వీరేష్ కుమార్ పాల్గొని అమ్మవారి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ విద్యాబుద్ధులు, జ్ఞాన విజ్ఞానాలను ప్రసాదించే సరస్వతీ దేవికి విశేష అర్చనలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కిరణ్ శాస్త్రి, డాక్టర్ వీరేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అధ్యాపకులు, పరిశోధకులు తమ పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలు సాధించాలని ఆకాంక్షించారు. సంస్థ సమగ్ర అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యా ప్రగతి, అధ్యాపకుల పరిశోధనా విజయాలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నారు. విద్యార్థుల్లో జ్ఞాన సముపార్జనతో పాటు సృజనాత్మక ఆలోచనలు, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయంలోని విజ్ఞాన వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. పూజా కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రంథాలయ ప్రాంగణాన్ని పుష్పాలు, రంగవల్లులతో అందంగా అలంకరించారు. ఈ వేడుకల్లో పలువురు ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు భారీగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు విద్యా ప్రాధాన్యతను చాటిచెప్పిన ఈ కార్యక్రమం గ్రంథాలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ జి.సంతోష్ కుమార్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రాజేశ్వర రెడ్డి, డాక్టర్ ప్రత్యూష జయంతి, డాక్టర్ హైమావతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ధర్మతేజ, ఎఆర్ రవికాంత్, అసిస్టెంట్ లైబ్రేరియన్ కమల మహంతి, సూపరిండెండెంట్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి దేవి అలంకారంలో శ్రీదేవి మహంకాళమ్మతల్లి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 11.**ఏలూరురోడ్డులోని వించేసియున్న శ్రీదేవి మహంకాళమ్మతల్లి ప్రతిరూప ఆలయం 8వ వార్షిక దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6 రోజున శుక్రవారం, శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో శ్రీదేవి మహంకాళమ్మతల్లిని అలంకరించారు.

దసరా ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారి అలంకరణకు దంపతులు

కొండాశ్రీనివాసరావు, శ్రీమతి లక్ష్మితలసి దంపతులు పాల్గొన్నారు. సరస్వతీ దేవి అలంకరణ తొ ఆలయ ప్రాంగణంలో చిన్నారులతో సరస్వతీ దేవి పూజా లు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. దసరా సందర్భంగా 6 రోజున సరస్వతీ దేవి అలంకారంలోని అమ్మవారిని దర్శించికోవడానికి భక్తులు విశేషంగా వచ్చారు. ఏలూరు రోడ్లోని ఆలయ పరిసర ప్రాంతాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శ్రీదేవి మహంకాళమ్మతల్లి ఆలయ వ్యవస్థాపకులు మరియు నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షులు యెగ్గిన నాగబాబుగారు, మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

**తాడేపల్లిగూడెం నియోజవర్గంలో రెండు జెడ్పిటిసిలు ఎంపీటీసీలకు దాదాపుగా అభ్యర్థులు ఖరారు**




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 16.**తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి కార్యాలయం నాయకులు, కార్యకర్తల సందడితో కోలాహలంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్‌చార్జి వడ్డీ రఘురాం నాయుడు దృష్టి సారించారు.ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ పదవుల ఆశావహులు పార్టీ కార్యాలయానికి చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. తమకు అవకాశం కల్పించాలని పలువురు ఆశావహులు పార్టీ నాయకత్వాన్ని కోరుతున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థుల ఎంపిక, పార్టీ శ్రేణులతో సమన్వయం వంటి అంశాలపై నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా నాయకులు దృష్టి సారిస్తున్న నేపథ్యంలో పార్టీ కార్యాలయం రాజకీయ సందడికి వేదికగా మారింది.

## పోలవరం నిర్వాసితులకు భూముల కొనుగోలుకు చర్యలు

**రైతుల భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు**

**భూముల విక్రయానికి ముందుకొచ్చే రైతులు వివరాలు అందించాలని సూచన**



**గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 16:**పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూములు కేటాయించేందుకు గంగవరం మండలంలో రైతుల నుంచి భూముల కొనుగోలుకు చర్యలు చేపడుతున్నట్లు పోలవరం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం గంగవరం మండలంలో రెవెన్యూ సిబ్బంది గుర్తించిన రైతుల భూములను ఆయన క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల వివరాలు, వాటి స్థితిగతులను రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు భూములు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా భూములు విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్న రైతులు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) ద్వారా తమ వివరాలను రెవెన్యూ శాఖకు అందించాలని సూచించారు. భూముల విక్రయానికి ముందుకొచ్చే రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, పట్టాదారు పాస్ పుస్తకం, అడంగల్‌తో పాటు భూములకు సంబంధించిన ఇతర అవసరమైన పత్రాలను జతచేసి సమర్పించాలని తెలిపారు.రైతులు అందజేసిన వివరాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి తదుపరి చర్యలు చేపడతారని పేర్కొన్నారు. భూముల కొనుగోలు ప్రక్రియలో రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకన్న, వీఆర్ఏ, పలువురు రైతులు, మాజీ సర్పంచ్ మడకం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# గంగవరంలో 19న సామూహిక కుంకుమ పూజ

**దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమం**

**భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి: కట్రం చిన్నాలు దొర**

**గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 16:**దసరా ఉత్సవాలు, దేవీ నవరాత్రుల సందర్భంగా గంగవరం మండల కేంద్రంలో ఈ నెల 19వ తేదీ సోమవారం సామూహిక కుంకుమ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు కట్రం చిన్నాలు దొర తెలిపారు. రాజమహేంద్రవరం వనవాసీ ధర్మ రక్షణ సమితి, సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 10 గంటలకు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చైతన్యం, భక్తిభావం పెంపొందించడమే లక్ష్యంగా సామూహిక కుంకుమ పూజ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ముక్క, అమ్మవారి చిత్రపటాలను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు తమ వెంట పళ్లెం, గ్లాసు, బియ్యం, రెండు కొబ్బరికాయలు, పూలు, పండ్లు తీసుకురావాలని సూచించారు.సామూహిక కుంకుమ పూజ అనంతరం భక్తులందరికీ అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దసరా నవరాత్రుల పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో గంగవరం మండలంతో పాటు పరిసర గ్రామాల హిందూ బంధువులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కట్రం చిన్నాలు దొర కోరారు.

# ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించిన సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 16:** గ్రామీణ పరిధిలోని బొమ్మూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల గోడౌన్, రిసెప్షన్ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి భద్రపరిచే విధానం, పోలింగ్ సామగ్రి స్వీకరణ, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శుభం నోక్వాల్ మాట్లాడుతూ, ఎన్నికల సామగ్రి భద్రపరిచే ప్రాంతంలో భద్రతా చర్యలు చేపట్టాలని, రిసెప్షన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి సదుపాయాలు కల్పించాలని, ఓట్ల లెక్కింపు అనువైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని, భద్రతా పరమైన అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలోజెడ్పీ కి సి ఈ వో ఎమ్. రాజు, డీఎస్పీ ఏ . శివ ప్రియ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పి. వీణదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ , సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ), రాజమహేంద్రవరం గ్రామీణ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) సిహెచ్ సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఎన్నికల కోడ్ కొత్తపల్లికి వర్తించదా?

## అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు



**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 16:-**గోకవరం మండలం లో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు అవుతుండగా, మండలంలోనే మేజర్ గ్రామ పంచాయతీ అయిన కొత్తపల్లి గ్రామంలో మాత్రం ఎన్నికల నియమావళి అమలు కావడం లేదా? లేక కావాలనే వదిలేశారా? అనే అనుమానాలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి.ఎన్నికల నిబంధనల ప్రకారం, గ్రామంలో ఎక్కడా కూడా రాజకీయ పార్టీల నాయకుల ఫోటోలు,ఫ్లెక్సీలు,ప్రారంభోత్సవ, శంకుస్థాపనల శిలాఫలకాలపై నాయకులు ఫోటోలు కనిపించకూడదు. ఒకవేళ ఉన్నా, వాటికి ముసుగు వేయడం లేదా తొలగించడం అధికారుల బాధ్యత. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఎన్నికల అధికారి ఇప్పటికే హెచ్చరించారు.కానీ కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. గ్రామంలో ఏ వీధిలో చూసినా వివిధ రాజకీయ పార్టీల నాయకుల ఫోటోలతో కూడిన శిలాఫలకాలు బహిరంగంగానే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ఆర్ అండ్ బి ప్రధాన రహదారి పక్కనే ఉన్న మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి కనీసం చిన్న గుడ్డ కూడా కప్పకపోవడం పట్ల గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.మిగతా అన్ని పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు చురుకుగా తిరిగి ఫ్లెక్సీలు తొలగిస్తుంటే,కొత్తపల్లిలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఎన్నికల కోడ్ అందరికీ ఒకేలా వర్తించాలి. ఒక గ్రామంలో కఠినంగా అమలు చేసి, మరో గ్రామంలో వదిలేస్తే, అది పక్షపాతంగా కనిపిస్తుంది. దీనివల్ల ఎన్నికల సమయంలో అపోహలకు తావిస్తుంది అని గ్రామానికి చెందిన పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కల్పించుకుని, మండలంలోని అన్ని పంచాయతీలలో ఒకే విధమైన ఆదేశాలు ఇచ్చి, ఎన్నికల కోడ్ ను పగడ్బందీగా అమలు చేయాలని, లేనిపక్షంలో జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) గారికి ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.ఏది ఏమైనా, పంచాయతీ స్థాయి సిబ్బందికి ఎన్నికల కోడ్ పై పూర్తి అవగాహన కల్పించి, సరైన డైరెక్షన్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# బలుసులమ్మ తల్లి అమ్మవారి సరస్వతి దేవిగా అలంకరణ

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 16.**తాడేపల్లిగూడెం పట్టణ గ్రామదేవత శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు 6 రోజు అత్యంత వైభవంగా సరస్వతి దేవి అలంకరణ దర్శనం ఇస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల 6 రోజు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. అమ్మవారికి కుంకుమ పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఆవుపాలు, పెరుగు, తేనె, వివిధ సుగంధ ద్రవ్యాలు, పలు నదుల పవిత్ర జలాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలతో ఆలయంలో భక్తిమయ వాతావరణం నెలకొంది.

### సరస్వతి దేవి అమ్మవారి దర్శనం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ బలుసులమ్మ అమ్మవారు సరస్వతి దేవి పుస్తకాలు, పెన్లు, ప్యాడ్స్, విద్య సామగ్రి తో తో అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేల సంఖ్యలో విద్యార్థులు సరస్వతి పూజలు నిర్వహించారు.అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అర్చకుల ఆధ్వర్యంలో విశేష పూజలు ఆలయ అర్చకులు ప్రదీప్ శర్మ, గోపీనాథ్ శర్మ, మల్లికార్జున శర్మ అమ్మవారికి నిత్యం విశేష పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ శ్రీరంగం అంజి, ఆలయ ఈఓ బీవీ చంద్రశేఖర్ పర్యవేక్షిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి, ఆయన తల్లిదండ్రులు శ్రీరంగం సత్యనారాయణ, సావిత్రి దంపతులతో పాటు నీలం సురేష్, జయ కృష్ణ ,దాట్ల జగన్నాథరాజు, కళ్యాణం రామచంద్రరావు, చెన్నం శెట్టి బాలాజీ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభం కావడంతో శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రానున్న రోజుల్లో అమ్మవారి వివిధ అలంకారాలు, విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.



# అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి టీడీపీ నాయకులు డా. గోరంట్ల ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, అక్టోబర్ 16:**రూరల్ నియోజకవర్గం, ధవళేశ్వరం గ్రామంలోని లక్ష్మీ జనార్దన స్వామి కాలనీలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో బెసపు శ్రీనివాస్ నివాస గృహం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సర్వస్వం కోల్పోయిన శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శిం చేందుకు టీడీపీ యువ నాయకులు, ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవిరామ్ కిరణ్ నేడు వారి నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం కల్పించారు. తక్షణ సహాయంగా రూ. 10,000 నగదును శ్రీనివాస్ కుటుంబానికి అందజేశారు. ఈ విషయాన్ని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి దృష్టికి తీసుకువెళ్లి, ప్రభుత్వం ద్వారా బాధిత కుటుంబానికి తగిన సహాయం అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రధాన కార్యదర్శి పుక్కల్ల రాజు, ఆళ్ళ ఆనందరావు, అడప శ్రీనివాస్, గుబ్బల దశరథ రామయ్య, కొత్తూరు దుర్గారావు, విఠల్, దాసరి సాగర్, చొల్లా వెంకటేష్, పంపన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# జలాశయాల్లో 41,400 చేప పిల్లల విడుదల




- మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రోత్సాహం
- సూరంపాలెం జలాశయంలో 36 వేలు, వెంకటపతిరాజు చెరువులో 5,400 చేప పిల్లలు

**గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 16:**మత్స్య సంపదను పెంపొందించడంతో పాటు మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా గంగవరం మండలంలోని పలు జలాశయాల్లో నాణ్యమైన చేప పిల్లలను విడుదల చేశారు. మండలంలోని దోనెలపల్లి, రాములదేవపురం మత్స్య సహకార సంఘాల పరిధిలో ఉన్న సూరంపాలెం జలాశయంలో 36 వేల చేప పిల్లలు, వెంకటపతిరాజు చెరువులో 5,400 చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు కలిసి విడుదల చేశారు. మొత్తం 41,400 చేప పిల్లలను జలాశయాల్లో వదిలారు.ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాల ద్వారా నాణ్యమైన మేలుజాతి రాగండి, బొచ్చె, మోసు రకాల చేప పిల్లలను విడుదల చేసినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. జలాశయాల్లో చేపల ఉత్పత్తిని పెంచడం ద్వారా మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి.వి. రవికుమార్, నెల్లిపూడి గ్రామ మత్స్య సహాయకుడు వి. శ్రీనుబాబు, దోనెలపల్లి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కుంజం దొంగబాబు దొర, కార్యదర్శి సారపు వెంకన్న దొరతో పాటు మత్స్య సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# తల్లి జ్ఞాపకార్థం గండిపోశమ్మ అమ్మవారికి 5 కిలోల వెండి కవచాన్ని సమర్పించిన కుమారులు



**తాళ్లపూడి, పెన్ పవర్, అక్టోబర్ 16:**తాళ్లపూడి మండలంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా, మండల విద్యాశాఖ అధికారి(ఎంఈఓ)గా సేవలందించి, పదవీ విరమణ అనంతరం కూడా గ్రామంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన స్వర్గీయ సిరిపురపు కనకమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు కొవ్వూరు మండలంలోని కుమారదేవంలో వేంచేసియున్న గండిపోశమ్మ అమ్మవారికి భారీ విరాళాన్ని అందజేశారు.కనకమ్మ కుమారులు భీమునిపట్నంలోని ఏఎన్ఐటీఎస్ మెడికల్ కాలేజ్ సీఈఓ డాక్టర్ సిరిపురపు చంద్రశేఖర రెడ్డి, సుజాత దంపతులు, ప్రముఖ వ్యాపారవేత్త సిరిపురపు మదన్ మోహన్ రెడ్డి, సుజన దంపతులు కలిసి అమ్మవారికి ఐదు కిలోల వెండి కవచాన్ని సమర్పించారు. ఈ వెండి కవచాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. తమ తల్లి జ్ఞాపకార్థం అమ్మవారికి వెండి కవచాన్ని సమర్పించడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుంకవల్లి వెంకటేశ్వరరావు, ఆలయ చైర్మన్ రామకృష్ణ, ఆలయ ఈఓ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కొవ్వూరు మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై ఆర్డీఓ సమీక్ష

- కంట్రోల్ రూమ్, స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన
- ఆర్డీవో కె.ఆనందరావు




**కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 16:**కొవ్వూరు మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లపై రెవెన్యూ డివిజనల్ అధికారి కె.ఆనందరావు శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయంలో జోనల్ అధికారులతో సమావేశమై ఎన్నికల సన్నద్ధత, అధికారుల విధులు, బాధ్యతలు, వివిధ శాఖల మధ్య సమన్వయంపై సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి తమకు కేటాయించిన విధులను అధికారులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం వేములూరు గ్రామంలోని దీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల కంట్రోల్ రూమ్, స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆర్డీఓ కె.ఆనందరావు, డీఎస్పీ డి.దేవకుమార్, డీడీఓ కె.శ్రీనివాసరావు , మున్సిపల్ కమిషనర్ గ్రంథి సందీప్, తహసీల్దార్ దుర్గా ప్రసాద్, తదితర అధికారులు పరిశీలించారు. ఎన్నికల సామాగ్రి భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, కంట్రోల్ రూమ్ పనితీరు, పోలింగ్ అనంతరం సిబ్బంది నుంచి ఎన్నికల సామగ్రి స్వీకరణకు అవసరమైన సదుపాయాలు, ఓట్ల లెక్కింపు కేంద్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, భద్రతా పరమైన అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై జోనల్ అధికారులతో సమీక్ష - ఆర్డీవో కె ఆనంద రావు



**కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 16:-** కొవ్వూరు మున్సిపల్ ఎన్నికలను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.ఆనందరావు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో జోనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణ, సంబంధిత ఏర్పాట్లు, అధికారుల బాధ్యతలు, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి తనకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి అవసరమైన చర్యలను ముందుగానే పూర్తి చేయాలని ఆర్డీఓ సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన ఆదేశించారు.

# గోకవరం ఎంపీపీ అభ్యర్థిగా పాటి రాంబాబు ఖరారు..?

**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 16:-**గోకవరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ ) గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున రంప యర్రంపాలెం గ్రామానికి చెందిన మండల పార్టీ అధ్యక్షుడు పాటి రాంబాబు పేరు ఖరారు అయినట్లు మండలంలో జోరుగా ప్రచారం సాగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కష్టకాలం లో మండల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ముందుకు సాగుతున్న పాటి రాంబాబుకు ఎంపీపీగా అవకాశం ఇవ్వడం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది.పాటి రాంబాబు రాజకీయ ప్రస్థానం గ్రామంలో పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రారంభమైంది. అనంతరం చిట్టూరి రవీంద్ర ఆశీస్సులు, మాజీ మంత్రి తోట నరసింహం దీవెనలతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తన భార్యను ఎంపీటీసీగా విజయపథంలో నడిపించి, తాజా మాజీ ఎంపీటీసీగా తన సత్తా చాటారు.పార్టీకి కష్టకాలం వచ్చినప్పుడు అధ్యక్షుడిగా నిలబడి పార్టీ జెండాను మోసిన పాటి రాంబాబుకు ఎంపీపీ పదవి పార్టీ తరుపున వరించడం పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# షర్మిలకు ఏమైంది?! కీలక సమయంలో వినిపించని వాయిస్



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** స్థానిక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల వైఖరిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత పూర్తిగా దెబ్బతిన్న కాంగ్రెస్ పార్టీకి దిక్సూచిగా మారి ఆ పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపిన షర్మిల స్థానిక ఎన్నికల వేళ అసలు కనిపించకుండా తిరుగుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన సమయంలో షర్మిల వెనకడుగు వేయడానికి కారణమేంటి? వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉండి పార్టీని వదిలేస్తారా? అంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి షర్మిల సైలెంట్ కావడం కేడర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లుగా చెబుతున్నారు.

**ఉనికి కోసం పోరాటం.. ఆపై సైలెంట్!**

వైఎస్ షర్మిల రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తర్వాత పార్టీకి ఒక ఊపు వస్తుందని అంతా భావించారు. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ఆమె చేసిన విమర్శలు, ఎన్నికల వేళ ఆమె దూకుడు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా కొన్ని కీలక అంశాలపై, ప్రజా సమస్యలపై ఆమె స్పందించిన తీరు కాంగ్రెస్ పార్టీ ఇంకా బతికే ఉందనే సంకేతాలను ఇచ్చింది. అయితే, ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాత షర్మిల రాజకీయ కార్యకలాపాల్లో స్పష్టమైన అస్థిరత కనిపిస్తోందనే విమర్శలున్నాయి. తాజాగా ఎన్నికల సంఘం వద్ద నిరసనలు, కొన్ని పరిమిత కార్యక్రమాలు మినహా క్షేత్రస్థాయిలో ఆమె పెద్దగా కనిపించడం లేదని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనా.. ఏపీ కాంగ్రెస్ అధినాయకత్వం వైపు నుంచి ఎలాంటి హడావుడి కనిపించడం లేదని అంటున్నారు. సాధారణంగా స్థానిక ఎన్నికలు అంటేనే పార్టీల బలాబలాలకు అసలైన గీటురాయిగా చెబుతారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసుకోవడానికి, కేడర్‌లో జోష్ నింపడానికి ఇదొక చక్కటి అవకాశంగా భావిస్తారు. కానీ, ఈ కీలక సమయంలో పీసీసీ చీఫ్ షర్మిల పూర్తిగా మౌనం దాల్చడం, అభ్యర్థుల ఎంపికపై లేదా ఎన్నికల సంసిద్ధంగా ఉండేలా కార్యకర్తల తయారీపై దృష్టి పెట్టకపోవడం అనేక సందేహాలకు తావిస్తోందని అంటున్నారు. షర్మిల లాంటి ఫైర్‌బ్రాండ్ లీడర్ నుంచి ఇలాంటి నిరాసక్తతను కేడర్ అసలు ఊహించలేదు. ఎన్నికల్లో గెలుపోటములు పక్కన పెడితే, పోటీలో ఉండి పార్టీ జెండాను నిలబెట్టాల్సిన బాధ్యత అధినాయకత్వాని ఉందని అంటున్నారు. కానీ ఈ సమయంలో ఆమె కనిపించకపోవడం క్యాడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టివేస్తోందని చెబుతున్నారు. స్థానిక సంస్థల్లో పోటీకి దూరంగా ఉండటం ద్వారా సంస్థాగతంగా కాంగ్రెస్‌ను పునరుద్ధరించుకునే మహావకాశాన్ని ఆ పార్టీ చేజేతులా వదులుకుంటోందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. "స్థానిక ఎన్నికల్లో పోటీపై షర్మిలకు అసలు ఆశలు లేవా? లేక పార్టీ వనరుల కొరత, క్యాడర్ లేమితో ఈ ఎన్నికలను లైట్ తీసుకున్నారా? అనే ప్రశ్నలు రాజకీయ పరిశీలకుల నుంచి వస్తున్నాయి.

# గోదావరి-కావేరి అనుసంధానం సాధ్యమేనా?




**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత జోసెఫ్ విజయ్‌ల మధ్య జరిగిన సమావేశం దక్షిణ భారత రాజకీయ, జలవనరుల వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. చారిత్రకంగా చెన్నై నగర తాగునీటి అవసరాల కోసం ఏపీ నుంచి అందించే తెలుగు గంగ నీటి సరఫరాపై ఈ భేటీలో ప్రాథమిక చర్చలు జరిగినప్పటికీ, అసలు సిసలైన కీలక అంశం మాత్రం గోదావరి–కావేరి నదుల అనుసంధానంపైనే నడిచింది. నదుల అనుసంధానంపై సుదీర్ఘకాలంగా స్పష్టమైన ప్రణాళికలతో ఉన్న చంద్రబాబుతో, తమిళనాడు సీఎంగా పగ్గాలు చేపట్టిన విజయ్ ఈ సుదూర జల కల నెరవేర్చేందుకు చేతులు కలపడం అంతర్రాష్ట్ర జల సంబంధాలలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది.కావేరి జలాల పంపిణీ విషయంలో కర్ణాటకతో తమిళనాడు దశాబ్దాలుగా వివాదాలను ఎదుర్కొంటోంది. ఈ శాశ్వత నీటి సంక్షోభానికి నాటి ప్రాజెక్టులే పరిష్కారమని భావిస్తున్న సీఎం విజయ్ ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీని స్వయంగా కలిసి ఒక ప్రతిపాదనను సమర్పించారు. స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన గోదావరి–కావేరి అనుసంధాన ప్రాజెక్టును చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు నాయుడు కూడా జాతీయ నదుల అనుసంధానానికి మొదటి నుంచీ గట్టి మద్దతుదారుడిగా ఉండటంతో, ఇద్దరు పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ డ్రీమ్ ప్రాజెక్టుపై ఒకే తాటిపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.అసలు గోదావరి–కావేరి అనుసంధానం సాధ్యమేనా అనే ప్రశ్న టెక్నికల్, లీగల్ వర్గాల్లో తలెత్తుతోంది. కేంద్ర జలసంఘం , నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాథమిక నివేదికల ప్రకారం, సముద్రంలో వృథాగా కలుస్తున్న గోదావరి మిగులు జలాలను కృష్ణా, పెన్నా నదుల ద్వారా కావేరి నదికి మళ్లించడం సాంకేతికంగా సాధ్యమే. గోదావరి బేసిన్‌లోని ఇచ్చంపల్లి, సమ్మక్క బ్యారేజీ లేదా పోలవరం జలాశయం నుంచి దాదాపు 147 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్, సోమశిల, నాగార్జునసాగర్ రైట్ కెనాల్, గ్రావిటీ, లిఫ్ట్ పద్ధతుల ద్వారా తమిళనాడులోని గ్రాండ్ ఆనకట్ట వరకు తీసుకెళ్లేలా రూ. 60,000 కోట్లకు పైగా వ్యయంతో డిజైన్లు సిద్ధం చేశారు.ఈ ప్రాజెక్టు నెరవేరితే దక్షిణ భారతదేశంలోని నాలుగు ప్రధాన రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మరియు పుదుచ్చేరిలకు అపారమైన ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఏపీలోని రాయలసీమ, ప్రకాశం , నెల్లూరు జిల్లాల కరువు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు విస్తారంగా లభిస్తాయి. అదే సమయంలో ఏటా తీవ్ర కరవును, తాగునీటి కొరతను ఎదుర్కొంటున్న తమిళనాడులోని డెల్టా జిల్లాలకు , చెన్నై నగర దాహార్తికి కావేరి అనుసంధానంతో శాశ్వత ఉపశమనం లభిస్తుంది. పంట కాలాల్లో కర్ణాటకపై ఆధారపడాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది. ఈ ప్రాజెక్టు ఆచరణలోకి రావడానికి ప్రధానంగా మూడు పెద్ద సవాళ్లు అడ్డుగా నిలుస్తున్నాయి. మొదటిది అంతర్రాష్ట్ర జల వివాదాలు. గోదావరిలో మిగులు జలాలు లేవని, ముందస్తుగా తమ నీటి అవసరాలను తీర్చాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేస్తుండగా, డిజైన్ల మార్పులపై ఏపీ తనదైన శైలిలో సూచనలు చేస్తోంది. రెండవది భారీ ఆర్థిక భారం. పదుల వేల కోట్లతో కూడుకున్న ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, కేంద్ర ప్రభుత్వమే 90 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. మూడవది అటవీ, పర్యావరణ అనుమతులు , వేల ఎకరాల భూసేకరణ అవసరం ఉంటుంది. దక్షిణ భారతదేశాన్ని సుభిక్షం చేసే ఈ చారిత్రక ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి చంద్రబాబు అనుభవం, విజయ్ రాజకీయ పట్టుదల కలవడం శుభపరిణామం. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, ఏపీ, తమిళనాడుల సంయుక్త విజ్ఞప్తుల ఆధారంగా ప్రత్యేక ఎస్పీవీని ఏర్పాటు చేసి, నిధులు కేటాయిస్తేనే ఈ బృహత్తర జల యజ్ఞం కాగితాల నుంచి క్షేత్రస్థాయిలోకి దిగుతుంది. రెండు రాష్ట్రాల సీఎంల మధ్య జరిగిన ఈ చర్చలు రాబోయే రోజుల్లో ఢిల్లీ స్థాయిలో ఎలాంటి కదలిక తెస్తాయో చూడాలి.

# స్థానిక పోరులో బలమైన వ్యూహం ఓటు బదిలీ సాధ్యమేనా?

**విజయవాడ అక్టోబరు 16 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ, మున్సిపల్, జడ్పీటీసీ ఎన్నికల వేళ అధికార ఎన్డీయే కూటమిలోని ప్రధాన భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, ఆధిపత్య పోరు రచ్చకెక్కుతోంది. క్షేత్రస్థాయిలో తమ గ్రాఫ్ , ఓటు బ్యాంక్ అత్యంత బలంగా ఉందని రెండు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వాలు గట్టిగా నమ్ముతున్నాయి. శాసనసభ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించామన్న ధీమాతో జనసేన 40 శాతం స్థానాలను డిమాండ్ చేస్తుంటే.. దశాబ్దాల క్షేత్రస్థాయి కేడర్ బలం తమకే ఉందంటూ టీడీపీ స్థానిక నాయకులు ప్రతిఘటిస్తున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం పార్టీ బలం లేదా అడిగినన్ని సీట్లు కేటాయించడం మాత్రమే ముఖ్యం కాదు. డివిజన్, వార్డు , గ్రామీణ స్థాయిలో కచ్చితంగా గెలిచే ఆధిపత్యం ఉన్న బలమైన అభ్యర్థులు బరిలో ఉన్నారా లేదా అనేదే అసలు సూత్రం. జనసేన కోరినన్ని స్థానాలు కేటాయించినప్పటికీ, విజయం సాకారం కాకపోతే అది అంతిమంగా కూటమి ప్రభుత్వ ప్రతిష్టకే భంగకరమని టీడీపీ అధిష్టానం భావిస్తోంది. అందువల్లే, కేవలం సీట్ల పంపిణీతో సరిపెట్టకుండా జనసేన తరఫున నిలబడే అభ్యర్థుల ఎంపిక, వారి జనాదరణ, విజయావకాశాలపై కూడా టీడీపీ లీడర్‌షిప్ సలహాలు, సూచనలు అందిస్తోంది.ఈ వ్యూహాత్మక సమీకరణాల్లో భాగంగానే బెజవాడ రాజకీయంలో కీలక నేత వంగవీటి రాధాకృష్ణ జనసేన తీర్థం పుచ్చుకోవడం వెనుక పెద్ద ప్లాన్ ఉందనే విశ్లేషణలు వస్తున్నాయి. కృష్ణా, గుంటూరు, ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వంగవీటి కుటుంబానికి ప్రత్యేకమైన సామాజిక, రాజకీయ అనుచరగణం ఉంది వంగవీటి రాధా లాంటి ఇమేజ్ ఉన్న నేత పార్టీలో ఉండటం వల్ల అటు కాపు సామాజిక వర్గంతో పాటు స్థానిక స్థానాల్లో కేడర్‌ను ఏకీకృతం చేయడం సులువవుతుందని భావించారు. కిందిస్థాయిలో పార్టీల మధ్య జరుగుతున్న ఈ ఆధిపత్య పోరాటాలు, అభ్యర్థుల మార్పిడులు, అధిష్ఠానాల సలహాలు సాధారణ కేడర్‌లో ఒకింత అసంతృప్తిని రాజేస్తున్నాయి. ఏళ్ల తరబడి గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ కోసం కష్టపడిన టీడీపీ, జనసేన స్థానిక నాయకులు తమ సీటు పొత్తులో భాగంగా ప్రత్యర్థి పార్టీకి పోతోందని తెలియగానే తీవ్ర విముఖత చూపుతున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ రెండు పార్టీల అనుకూల హ్యాండిల్స్ ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకుంటుండటం వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తోంది.ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో ఓటు బదిలీ కి పెద్ద అడ్డంకిగా మారతాయా అన్న ఆందోళన కూటమి పెద్దలను వేధిస్తోంది. ఎమ్మెల్యే ఎన్నికల్లో పొత్తు ధర్మం సాఫీగా పనిచేసినప్పటికీ, స్థానిక ఎన్నికలు సంపూర్ణంగా వ్యక్తిగత ప్రభావాలు, బంధుత్వాలు, ప్రాంతీయ విభేదాలపై ఆధారపడి ఉంటాయి.ద

ఒక వార్డులో టీడీపీ అసమ్మతి వర్గం జనసేన అభ్యర్థికి సహకరించకపోవడం లేదా జనసేన కేడర్ టీడీపీ అభ్యర్థికి ఓటు వేయకపోవడం జరిగితే, అది నేరుగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీని స్థానిక స్థాయిలో కోలుకోకుండా దెబ్బతీయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు ఈ ఓట్ల బదిలీ సవాలుగా మారింది. ఏరికోరి అభ్యర్థులను బరిలోకి దింపినా, అసమ్మతి నాయకులను ప్రాథమిక దశలోనే ప్రసన్నం చేసుకోలేకపోతే క్షేత్రస్థాయిలో కూటమి అభ్యర్థుల గెలుపు గుర్రాలు నీరుగారే అవకాశాలున్నాయి. అందుకే కేవలం సీట్ల సర్దుబాటే కాకుండా, రెండు పార్టీల స్థానిక కమిటీలను సంయుక్తంగా రంగంలోకి దించేలా సమన్వయ కమిటీల ద్వారా చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ఎన్నికల సమరం కూడా ప్రారంభమైనందున టీడీపీ–జనసేన అగ్రనాయకత్వం ఈ క్షేత్రస్థాయి అసమ్మతిని ఎలా చల్లారుస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# సుప్రీంకోర్టు కేసులు క్లియర్ కాగానే ఆ 23 స్థానాల్లో ఎన్నికలు

**కాకినాడ,అక్టోబరు 16 పెన్ పవర్:**
ఏపీలో 123 అర్బన్ లోకల్ బాడీస్ ఉండగా ప్రస్తుతం 10 నగర పంచాయతీలు, 77 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లకు మాత్రమే ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ అయింది. సుప్రీంకోర్టులో కేసుల కారణంగా 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు, 4 నగర పంచాయతీలకు ప్రస్తుతం నోటిఫికేషన్ రిలీజ్ కాలేదు. సుప్రీంకోర్టు కేసులు క్లియర్ కాగానే ఆ 23 స్థానాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు ఏపీ ఎలక్షన్ ప్రధాన కమిషనర్. సమీప గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ నడుస్తోంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. విలీన ప్రక్రియను నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ.. ప్రభుత్వం తీసుకునే చర్యలన్నీ తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. అన్ని పిటిషన్లపై నవంబర్ 17న సుప్రీంకోర్టులో తుది విచారణ జరగబోతోంది. న్యాయపరమైన వివాదం కారణంగా ఎన్నికలు నిర్వహించలేని పట్టణ స్థానిక సంస్థల జాబితాలో మొత్తం 23 ప్రాంతాలున్నాయి. వీటిలో రాజమండ్రి, కాకినాడ, మంగళగిరి, శ్రీకాకుళం లాంటి కీలక కార్పొరేషన్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, ఏలూరు జిల్లాలోని ఒక మున్సిపాలిటీలో ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ పడింది. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెంతో పాటు.. ఏలూరు జిల్లా చింతలపూడి మున్సిపాలిటీల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడలేదు. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లులో విలీన గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించారు. తణుకులో వార్డుల డీలిమిటేషన్ కారణంగా ఎన్నికలు ఆగాయి.రాజమండ్రి కార్పొరేషన్‌కు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. విలీన గ్రామాల ప్రజలు రాజమండ్రి కార్పొరేషన్ ఏకపక్ష నిర్ణయాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పిటిషన్ హైకోర్టులో.. విచారణ దశలో ఉన్న కారణంతో ఎన్నికలు తాత్కాలికంగా నిలిపివేశారు. కుశాలపురం పంచాయతీ విలీనంపై గ్రామస్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలు ఆగాయి. 2005 తర్వాత శ్రీకాకుళం మున్సిపాలిటీలో ఎన్నికలు జరగలేదు. 12ఏళ్లుగా శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో ఎన్నికలు జరగడం లేదు. ఈసారి కూడా వారికి నిరాశే ఎదురైంది. విలీన గ్రామాలు కేసు, వార్డుల విజభన పెండింగ్ ఉండటంతో.. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వలేదు.విజయనగరం జిల్లా రాజాం నగర పంచాయతీలో కోర్టు కేసుల కారణంగా 21ఏళ్లు ఎన్నికలు జరగలేదు. ఇటీవలే విలీన గ్రామాల పిటిషనర్లు కేసు విత్ డ్రా చేసుకోవడంతో ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. వార్డుల విభజన పూర్తికాకపోవడంతో.. రాజాంలోనూ ఎన్నికల జరపడం లేదు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మున్సిపాలిటీకి చివరగా 2014లో ఎన్నికలు జరిగాయి. వార్డుల విభజన సరిగా లేదని టీడీపీ నేత కోర్టును ఆశ్రయించడంతో.. గ్రేడ్ 2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయినప్పటికీ కోర్టు వివాదం కారణంగా ఎన్నికలు నిర్వహించడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్‌లో ఎన్నికలు ఆగాయి. పల్నాడు జిల్లాలోని నర్సరావుపేట, గుంటూరు జిల్లాలోని పొన్నూరు, బాపట్ల జిల్లాలోని బాపట్ల మున్సిపాలిటీతో పాటు మంగళగిరి కార్పొరేషన్ ఎన్నికలకు బ్రేక్ పడింది. వార్డుల పునర్విభజన, ఓటర్ జాబితా, రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో ఎన్నికలు ఆపారు.కావలి మున్సిపాలిటీ పరిధిలో తమను కలపొద్దు అంటూ కావలి రూరల్ మండలం చౌదరిపాలానికి చెందిన వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. దీంతో గతంలో ఇక్కడ ఎన్నికలు జరగలేదు. అల్లూరు నగర పంచాయతీ, గూడూరు మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించడంతో రెండుచోట్ల ఎన్నికలు జరగడం లేదు. మార్కాపురం జిల్లా పొదిలి నగర పంచాయతీలోనూ సేమ్ సీన్. విలీన గ్రామాల ప్రజలు కోర్టు మెట్లెక్కడంతో ఎన్నిక ఆగింది. ప్రకాశం జిల్లా కందుకూరు మున్సిపాలిటీలో వార్డుల విభజన ఆలస్యం కావడంతో తొలిదశలో ఎన్నికలు జరపడం లేదు. బి. కొత్తకోట మున్సిపాలిటీపై కోర్ట్ కేసు వెనక్కి తీసుకున్నా.. తుది తీర్పురాకపోవడంతో ఎన్నిక ఆగింది. అన్ని కేసులపై నవంబర్ 17న సుప్రీంకోర్టు విచారణ జరుపుతుండటంతో.. కోర్ట్ కేసు క్లియర్ అయ్యి ఎన్నికలు నిర్వహిస్తారా అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు

# పార్టీలు మారినా రాజకీయ భవితవ్యం..?

**విశాఖపట్నం , అక్టోబరు 16 పెన్ పవర్:**
నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రయాణం అంతా కాంగ్రెస్ పార్టీలోనే సాగింది. ముఖ్యమంత్రి పదవి నిర్వహించిన తర్వాత ఆయన రాజకీయ జీవితం ఒక్కసారిగా నెమ్మదించింది. పార్టీలు మారినా ఆయనకు ఎలాంటి రాజకీయ టర్నింగ్ పాయింట్ రాలేదునల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రయాణం అంతా కాంగ్రెస్ పార్టీలోనే సాగింది. ముఖ్యమంత్రి పదవి నిర్వహించిన తర్వాత ఆయన రాజకీయ జీవితం ఒక్కసారిగా నెమ్మదించింది. పార్టీలు మారినా ఆయనకు ఎలాంటి రాజకీయ టర్నింగ్ పాయింట్ రాలేదు. జై సమైక్య ఆంధ్ర పేరుతో కొత్త పార్టీ పెట్టినా ప్రయోజనం దక్కలేదు. మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరినా అక్కడ కూడా పెద్దగా గుర్తింపు దక్కలేదు. చివరకు ఆయన కాషాయ కండువా కప్పుకుని బీజేపీలో చేరారు. అయినప్పటికీ ఆయన రాజకీయ భవితవ్యం మాత్రం ఇంకా ఎక్కడా మారలేదు. ఆయనకు అపారమైన రాజకీయ అనుభవంతో పాటు మంచి పాలనాదక్షత ఉంది. బలమైన సామాజిక వర్గానికి చెందిన నేతగా మంచి పేరుంది. ఎలాంటి వివాదాలు లేని నాయకుడిగా అందరికీ సుపరిచితులు అయ్యారు. అన్ని అర్హతలు ఉన్నా కూడా ఆయనను రాజకీయ సిరి ఇప్పటివరకు పలకరించలేదు.కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను అధికారికంగా ప్రకటించింది. ఆ జాబితాలో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పేరు ఎక్కడా కనిపించలేదు. గవర్నర్లుగా ఎంపికైన వారంతా పూర్తిగా బీజేపీకి చెందిన నాయకులు కావడం ఇక్కడ విశేషం. కిరణ్ కుమార్ రెడ్డి మొదటి నుంచి కాంగ్రెస్ నేపథ్యం ఉన్న నేతగా గుర్తింపు పొందారు. కాషాయ పార్టీలో ఆయనను వలస నాయకుడిగా మాత్రమే చూస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వారికే బీజేపీలో అత్యధిక ప్రాధాన్యత లభిస్తుందనే వాదన ఉంది. రాజ్ భవన్ పదవులు దక్కాలంటే పార్టీ సిద్ధాంతాలను పూర్తిగా ఒంటబట్టించుకోవాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏపీలో కూడా పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది. కేంద్ర పెద్దలు గవర్నర్ల ఎంపిక విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. కేవలం విధేయత మాత్రమే కాకుండా పార్టీ కోసం చాలాకాలంగా కష్టపడిన వారికే పదవులు దక్కుతున్నాయి. ఈ సమీకరణాల కారణంగానే నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి ప్రస్తుతం ఎలాంటి కీలకమైన పదవులు దక్కడం లేదు. ఆయన ఎదురుచూపులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.సరిగ్గా ఈ కారణాల వల్లే కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయ ప్రయాణానికి కొంత అడ్డుకట్ట పడుతోంది. ఆయన తండ్రి కాలం నుంచి కుటుంబం మొత్తం కాంగ్రెస్ సిద్ధాంతాలకే కట్టుబడి ఉంది. అదే నేపథ్యం కారణంగా బీజేపీలోకి వచ్చినా సరే పార్టీలో అంతరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆయనకు 2024 ఎన్నికలలో రాజంపేట లోక్ సభ స్థానం కేటాయించారు. అది ఆయనకు అత్యంత సొంత ఇలాకా అయినప్పటికీ విజయం సాధించలేకపోయారు. రాష్ట్రంలో కూటమి గాలి వీచినా ఆయన ఓటమి పాలు కావడం గమనార్హం. దాంతో పార్టీ పెద్దలకు ఆయన మీద ఉన్న నమ్మకం కొద్దిగా సడలిపోయింది. ఎవరికి ఏ పదవి ఇస్తే ఎంత లాభం ఉంటుందో పార్టీ అధిష్టానం బేరీజు వేసుకుంటుంది. కేవలం బీజేపీ మాత్రమే కాదు ఏ రాజకీయ పార్టీ అయినా ఇదే సూత్రం పాటిస్తుంది. కేవలం పదవులు ఇవ్వడం వల్ల వచ్చే మైలేజ్ ఎంత అనే లెక్కలు చాలా ముఖ్యం. ఈ రాజకీయ లెక్కల వల్లే కిరణ్ కుమార్ రెడ్డి ఆశించిన స్థాయి గుర్తింపును పొందలేకపోతున్నారు. భవిష్యత్తులో ఆయన ఈ అడ్డంకులను ఎలా దాటుతారనేది చూడాలి.తొలినాళ్లలో కిరణ్ కుమార్ రెడ్డి రాజ్యసభకు వెళ్లాలని తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. పెద్దల సభ ద్వారా నేరుగా కేంద్ర మంత్రి పదవిని దక్కించుకోవాలని ఆయన ప్లాన్ వేసుకున్నారు. అయితే బీజేపీలోని ప్రస్తుత రాజకీయ సమీకరణల దృష్ట్యా ఆ ప్లాన్ వర్కవుట్ కాలేదు. దాంతో ఆయన తన ఆలోచనలను మార్చుకుని ఒక నిర్ణయానికి వచ్చారు. తనకున్న సీనియారిటీతో పాటు మాజీ సీఎం హోదాను దృష్టిలో పెట్టుకున్నారు. ఈ పదవుల కంటే గవర్నర్ పదవి అయితే చాలా మెరుగని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ప్రస్తుతం ఆయన చూపు పూర్తిగా రాజ్ భవన్ వైపు మాత్రమే నిలిచింది. ఈ కారణంగానే ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు కొద్దిగా దూరంగా ఉంటూ వస్తున్నారు. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర పెద్దలతో నిత్యం టచ్‌లో ఉంటూ లాబీయింగ్ చేస్తున్నారు. అలాగే ఏపీలో కూటమి సారథి చంద్రబాబుతో కూడా మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. అన్ని ప్రయత్నాలు చేస్తున్నా కూడా అనుకున్నది సాధించడంలో వెనుకబడిపోతున్నారు.నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి భవిష్యత్తులో రాజ్ భవన్ యోగం దక్కుతుందా లేదా అనేది పూర్తిగా బీజేపీ పెద్దల దయ మీద ఆధారపడి ఉంది. కేంద్ర నాయకత్వం ప్రతి విషయాన్ని చాలా ఆచితూచి అడుగులు వేస్తూ నిర్ణయిస్తుంది. ఈ విషయంలో అధిష్టానం సానుకూల నిర్ణయం తీసుకుంటే ఆయన త్వరలోనే గవర్నర్ కావచ్చు. ఒకవేళ అది కుదరకపోతే మరో విడత వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ శుభదినం ఎప్పుడు వస్తుందో ఎవరికీ స్పష్టత లేదు. అంతవరకు ఆయన కేవలం వేచి చూడటమే ఏకైక మార్గంగా మిగిలిపోయింది. రాజకీయాల్లో ఎవరికైనా సరే సరైన సమయం రావాల్సిందేనని అందరూ అంటుంటారు. కిరణ్ కుమార్ రెడ్డి విషయంలో కూడా అదే సూత్రం వర్తిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్నో పదవులు అనుభవించిన ఆయన చివరి దశలో ఎలాంటి పదవి అందుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. రాబోయే రోజుల్లో ఆయన రాజకీయ ప్రయాణం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఈ పరిణామాలు ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారాయి.

## పాకిస్తాన్, ఇంగ్లాండ్, శ్రీలంక మధ్య వన్డే ముక్కోణపు సిరీస్.. షెడ్యూల్ ఇదే!




2027 వన్డే ప్రపంచ కప్‌కు సరిగ్గా మరో ఏడాది మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యంలో వన్డే ముక్కోణపు సిరీస్ ప్రారంభం కానుంది. అక్టోబర్ 18 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీలో పాకిస్థాన్, ఇంగ్లాండ్, శ్రీలంక జట్లు తలపడనున్నాయి. 2025లో ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు సౌతాఫ్రికా, న్యూజిలాండ్‌లతో టోర్నీ నిర్వహించిన తర్వాత పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్న రెండో వన్డే ట్రై-సిరీస్ ఇది కావడం విశేషం. ఈ టూర్ ద్వారా ఇంగ్లాండ్ జట్టు ఏకంగా 2005 తర్వాత తొలిసారిగా పాక్ గడ్డపై వన్డే సిరీస్ ఆడబోతుండటంతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

పాకిస్థాన్: స్వదేశంలో జరుగుతుండటంతో పాక్ ఈ సిరీస్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. పేసర్ షాహీన్ షా అఫ్రిది కెప్టెన్‌గా జట్టును నడిపించనుండగా, బాబర్ ఆజమ్, ఫఖర్ జమాన్, రౌఫ్ వంటి స్టార్లతో టీమ్ బలంగా ఉంది.

ఇంగ్లాండ్: జూస్ బట్లర్, జోఫ్రా ఆర్చర్ లాంటి దిగ్గజాలు దూరమైనప్పటికీ, హ్యారీ బ్రూక్ సారథ్యంలో ఇంగ్లాండ్ అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఇటీవల భారత్‌ను, శ్రీలంకను వన్డేల్లో ఓడించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది.

శ్రీలంక: కుసల్ మెండిస్ నాయకత్వంలోని లంక జట్టు ఇటీవల పేలవ ప్రదర్శనలతో ఇబ్బంది పడుతోంది. 2027 వరల్డ్ కప్ రేసులో పుంజుకోవడానికి ఈ సిరీస్ వారికి మంచి అవకాశం.

**లైవ్ స్ట్రీమింగ్:**
భారతదేశంలోని క్రికెట్ అభిమానులు ఈ సిరీస్ మ్యాచ్‌లను (సోనీ స్పోర్ట్స్) ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించవచ్చు. అలాగే డిజిటల్ వీక్షకులు (సోనీ లివ్) యాప్ మరియు వెబ్‌సైట్‌లో లైవ్ స్ట్రీమింగ్ చూడవచ్చు.

**3 జట్ల పూర్తి వివరాలు:**
పాకిస్థాన్ జట్టు: షాహీన్ షా అఫ్రిది (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, సల్మాన్ అలీ ఆఘా, అరఫాత్ మిన్హాస్, బాబర్ ఆజమ్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, ముహమ్మద్ ఘాజీ ఘోరీ (వికెట్ కీపర్), హారీస్ రౌఫ్, హసన్ నవాజ్, నసీమ్ షా, రజావుల్లా, సాద్ బేగ్ (వికెట్ కీపర్), సైమ్ అయూబ్, షాదాబ్ ఖాన్, సుఫియాన్ మోకిమ్.

ఇంగ్లాండ్ జట్టు: హ్యారీ బ్రూక్ (కెప్టెన్), గస్ అట్కిన్సన్, సోనీ బేకర్, టామ్ బాంటన్, జేమ్స్ కోల్స్, జోర్డాన్ కాక్స్, మేసన్ క్రేన్, హెన్రీ క్రోకోంబ్, సామ్ కుర్రాన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జేమీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, జో రూట్, జోష్ టంగ్.

శ్రీలంక జట్టు: కుసల్ మెండిస్ (కెప్టెన్), సహన్ అరచ్చిగే, దుష్మంత చమీర, సచిందు కొలోంబాగే, అవిష్క ఫెర్నాండో, అసిథ ఫెర్నాండో, జనిత్ లియనాగే, దిల్షాన్ మధుశంక, ఈషన్ మలింగ, కమిందు మెండిస్, కమిల్ మిషార, లహిరు ఉదార, పవన్ రత్నాయకే, దసున్ షానక, మహీష్ తీక్షణ, దునిత్ వెల్లలాగే.

## సీఎస్కే మెంటార్‌గా ధోనీ?.. జహీర్ ఖాన్ హెడ్ కోచ్‌గా రావడంపై అశ్విన్ కీలక వ్యాఖ్యలు









ఐపీఎల్ 2027 ముంగిట ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ సంచలన నిర్ణయాలు తీసుకుంటోంది. దాదాపు 18 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం తర్వాత హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు వీడ్కోలు పలికిన సీఎస్కే.. భారత మాజీ పేస్ దిగ్గజం జహీర్ ఖాన్‌ను తమ కొత్త హెడ్ కోచ్‌గా నియమించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా బౌలింగ్ కోచ్‌గా భారత మాజీ పేసర్ మోహిత్ శర్మ నియామకం దాదాపు ఖాయం కాగా, మైఖేల్ హస్సీ స్థానంలో కొత్త బ్యాటింగ్ కోచ్ కోసం వేట ప్రారంభించింది. ఈ క్రమంలో దిగ్గజ ప్లేయర్ ఎంఎస్ ధోనీ పాత్రపై, కొత్త కోచింగ్ స్టాఫ్‌పై టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**ధోనీ రోల్, టీమ్ మెంటార్‌గా బెంచ్‌కే:**
మహేంద్ర సింగ్ ధోనీ ఇంకా రిటైర్మెంట్ ప్రకటించలేదు, కనీసం మరో ఒక సీజన్ ఆడతాడని అనుకుంటున్నప్పటికీ, మారిన కోచింగ్ వాతావరణంలో అతని పాత్రపై రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఆసక్తికర విశ్లేషణ చేశాడు. కొత్త కోచింగ్ స్టాఫ్‌తో ధోనీ, జహీర్ ఖాన్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ల మధ్య ఉండే సమీకరణాలు (ఱఎఖఎఱఎం) చూడటం ఎంతో ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ఈ సీజన్‌లో ధోనీ బహుశా టీమ్ మెంటార్‌గా (ఙఖఎ వీవత్‌శీతీ) కొత్త బాధ్యతలు చేపట్టి, బెంచ్‌కే పరిమితమయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. అలాంటప్పుడు గైక్వాడ్ సలహాల కోసం కొత్త కోచ్ జహీర్ ఖాన్ వద్దకు వెళ్తాడా లేక మెంటార్ హోదాలో ఉండే ధోనీ వద్దకే వెళ్తాడా అనేది కీలకంగా మారిందని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

**ఫ్లెమింగ్ లేకపోవడం ఆశ్చర్యకరమే:**
మాజీ చెన్నై కోచ్ నిష్క్రమణపై కూడా అశ్విన్ మాట్లాడుతూ.. స్టీఫెన్ ఫ్లెమింగ్ ఎప్పుడూ ఎంఎస్ ధోనీ ఆలోచనలకు, శైలికి తగినట్లుగా తనను తాను మలుచుకున్నాడు (వీశీఱటఱవం ష్ట్రఱఎంవశ్రీట).. మహీ గ్లవ్స్‌లో సరిగ్గా సరిపోయే వేళ్లలా ఫ్లెమింగ్ ఉండేవాడు. జట్టు, కెప్టెన్ అవసరాలకు తగ్గట్లు సర్దుకుపోవడమే ఫ్లెమింగ్ నైజం.. అలాంటిది కొత్త కెప్టెన్‌తో రెండు మూడేళ్ల అనుబంధం తర్వాత కూడా ఫ్లెమింగ్ కోచ్‌గా కొనసాగకూడదని సీఎస్కే నిర్ణయించుకోవడం నన్ను నిజంగా ఆశ్చర్యపరిచిందని ఆర్. అశ్విన్ తెలిపాడు.

**2027లో రుతురాజ్ గైక్వాడ్‌కే కెప్టెన్సీ:**
ధోనీ గాయం: ఐపీఎల్ 2026 సీజన్‌లో ధోనీ గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. సీజన్ మధ్యలో పునరాగమనం చేస్తాడని భావించినా, ప్రాక్టీస్ మ్యాచ్‌లో మళ్లీ గాయపడటంతో బెంచ్‌కే పరిమితమయ్యాడు.

కొత్త కెప్టెన్: ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందే ధోనీ నుంచి కెప్టెన్సీ అందుకున్న రుతురాజ్ గైక్వాడ్ ఐపీఎల్ 2027లోనూ సీఎస్కే నయా కెప్టెన్‌గా కొనసాగడం ఖాయమైంది.

2023లో ధోనీ ఫుల్ టైమ్ కెప్టెన్‌గా ఉన్నప్పుడు ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన సీఎస్కే, ఆ తర్వాత 2024, 2025, 2026 సీజన్లలో లీగ్ దశలోనే నిష్క్రమించి ప్లేఆఫ్స్ చేరడంలో విఫలమైంది. దీంతో ధోనీ-ఫ్లెమింగ్ ఐదు ఐపీఎల్ టైటిళ్ల శకం ముగిసి జహీర్ ఖాన్ రూపంలో కొత్త శకం స్టార్ట్ అయింది.

## టాస్ గెలిచి బౌలింగ్ తీసుకున్న భారత్.. స్మృతి మంధాన కొత్త వ్యూహాలు!





భారత మహిళా క్రికెట్ జట్టు వర్సెస్ జింబాబ్వే మహిళల జట్టు మధ్య మూడు వన్డేల సిరీస్‌లోని తొలి మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత సారథి స్మృతి మంధాన ముందుగా బౌలింగ్ తీసుకుంది. టీమిండియా కెప్టెన్ స్మృతి మంధాన మాట్లాడుతూ.. రాబోయే ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ సన్నాహకాల్లో భాగంగా, మంచు ప్రభావం ఎక్కువగా ఉండే రాత్రి సమయాల్లో ఛేజింగ్ చేసే అనుభవాన్ని సాధించడమే లక్ష్యంగా ముందుగా బౌలింగ్ తీసుకున్నట్లు స్మృతి వెల్లడించింది. కాగా రాబోయే టోర్నీలను దృష్టిలో పెట్టుకుని ముగ్గురు ఫాస్ట్ బౌలర్లు (అరుంధతి రెడ్డి, నందని శర్మ, క్రాంతి గౌడ్) ఇద్దరు స్పిన్నర్ల (దీప్తి శర్మ, శ్రీ చరణి) లతో బరిలోకి దిగుతున్నట్లు తెలిపింది. షెఫాలీ వర్మ ఆరో బౌలింగ్ ఆప్షన్‌గా ఉండబోతున్నట్లు తెలిపింది.

జింబాబ్వే కెప్టెన్ జోసెఫిన్ ఎన్‌కోమో మాట్లాడుతూ.. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో సాధించిన చారిత్రాత్మక విజయం తమ జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని పేర్కొనింది. యువ ఆటగాళ్లు, అనుభవజ్ఞుల కలయికతో ఉన్న తమ జట్టు భారత్ లాంటి బలమైన జట్టుతో ఆడి మంచి ప్రదర్శన ఇచ్చేందుకు ఉత్సాహంగా ఉందని పేర్కొంది.

# హీరోలు చేస్తే లేని తప్పు హీరోయిన్లు అడిగితే తప్పా?







ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత కాలంగా నటీనటుల పని గంటల పై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. షూటింగ్ సెట్స్‌లో నటీనటులు.. ముఖ్యంగా హీరోయిన్లు 8 గంటల షిఫ్ట్ వర్క్ డిమాండ్ చేయడంపై పరిశ్రమలో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో -దృశ్యం 3- సినిమాలో కీలక పాత్రలో నటించిన నటి ఇషితా దత్తా ఈ వివాదంపై స్పందించారు. స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణే మద్దతుగా నిలిచారు. -కల్కి 2898 AD- సీక్వెల్ ప్రాజెక్టల నుంచి దీపికా పడుకోణే తప్పుకోవడానికి ఎనిమిది గంటల షిఫ్ట్ డిమాండ్ కూడా ఒక కారణమనే వార్తలు వచ్చాయి. దీనిపై ఇండస్ట్రీలో హాట్ డిబేట్ నడుస్తుండగా ఇషితా దత్తా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. షూటింగ్‌లో 8 గంటల షిఫ్ట్ కోరడం ఎంతమాత్రం అసమంజసమైన డిమాండ్ కాదన్నారు.-ఒక నటి ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలని కోరినప్పుడు.. ప్రొడక్షన్ హౌస్ దానికి అంగీకరించకపోవడం వారి వ్యక్తిగత.. బిజినెస్ ఛాయిస్ కావచ్చు. ఆ డిమాండ్‌ను తప్పుగా చూపిస్తూ సదరు నటిని చిన్నచూపు చూడటం .. అవమా నించడం సరైన పద్ధతి కాదు. రోజుకు 12 నుండి 15 గంటలు పనిచేయడానికి సిద్ధంగా ఉండే నటీనటులు చాలామంది ఉండొచ్చు. కానీ తక్కువ సమయం కేటాయించాలనుకునే వారి నిర్ణయాన్ని తక్కువ చేసి మాట్లాడకూడద-న్నారు.తాను కూడా ఇద్దరు పిల్లలకు తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని ఇషితా దత్తా గుర్తుచేశారు. ఒక తల్లిగా మారిన తర్వాత కుటుంబం, పిల్లల పెంపకం , షూటింగ్ బాధ్యతలను బ్యాలెన్స్ చేయడం ఎంత కష్టమో అర్థమవు తుందన్నారు . ఒక బిడ్డకు జన్మనిచ్చినప్పుడే ఆ బాధ్యతల్లోని తీవ్రత .. శ్రమ ఏంటో తెలుస్తుంది. నాకు కూడా అంతటి డిమాండ్ చేసే స్థాయి ఉంటే? నేను కూడా ఖచ్చితంగా 8 గంటల షిఫ్ట్ డిమాండ్ చేసేదాన్ని. అయితే ప్రస్తు తానికి నేను ఆ స్థానంలో లేను- అని ఇషితా నిజాయితీగా వ్యాఖ్యానించారు. గతంలో దీపిక వర్కింగ్ అవర్స్ వివాదంపై ఇండస్ట్రీలోని పలువురు అగ్ర హీరోలు గత కొన్నేళ్లుగా రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పనిచేస్తున్నారని.. కానీ వారి గురించి ఎవరూ ప్రశ్నించరని గుర్తుచేశారు. నటీనటుల శారీరక, మానసిక ఆరోగ్యం , మెరుగైన పని వాతావరణం కోసం తాను ఈ డిమాండ్ చేశానని తెలిపారు. ఇప్పటికే సోనాక్షి సిన్హా, కరీనా కపూర్, అనన్య పాండే, సబా ఆజాద్ వంటి పలువురు కథానాయికలు కూడా దీపికా డిమాండ్‌కు మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965